


# విభారె

తెలుగు దినపత్రిక

VIBHARE TELUGU DAILY



ఆవుల పుల్లారెడ్డి సేవా సమితి
రి.నెం. 119/2015
ఆళ్ళగడ్డ, కర్నూలు జిల్లా
ఉచిత కళ్యాణ మండపం
స్వయం ఉపాధి శిక్షణ
ఉచిత రక్తదానము
ఉచిత న్యాయ సలహాలు
ఉచిత కంప్యూటర్ శిక్షణ
సంప్రదించవలసిన చిరునామా
అధ్యక్షులు ఆవుల విజయభాస్కర రెడ్డి అడ్వకేట్ B.A.L.L.B
ఆళ్లగడ్డ
9440232308,9494498787



PUBLISHED FROM KURNOOL ఎడిటర్ : ఆవుల విజయ భాస్కర రెడ్డి గురువారం 29 జూలై 2021 సంపుటి : 02 సంచిక :362 పేజీలు : 4 వెల : రూ 3-00


## క్రిప్టో కరెన్సీ వినియోగం గురించి కేంద్రం ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు

ఎవరైనా క్రిప్టోకరెన్సీ ట్రాన్సాక్షన్లు నిర్వహిస్తే మనీ ల్యాండరింగ్ విభాగం చర్యలు

కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్



న్యూ ఢిల్లీ జూలై 28 పార్లమెంట్ సమావేశాల సందర్భంగా దేశంలో క్రిప్టో మార్కెట్,వినియోగదారులు ఎంతమంది ఉన్నారో తెలుసుకునేందుకు కేంద్రం డేటా కలెక్ట్ చేస్తుందా? రాజ్యసభ సభ్యుడు సుశీల్‌కుమార్ మోడీ అన్న ప్రశ్నలకు నిర్మలా సీతారామన్ స్పందించారు.మనదేశంలో క్రిప్టో కరెన్సీ వినియోగం గురించి కేంద్రం ఎలాంటి నిర్ణయం తీసుకోవడం లేదు, ఎవరి డేటా కలెక్ట్ చేయడం లేదు.ఎవరైనా క్రిప్టోకరెన్సీ ట్రాన్సాక్షన్లు నిర్వహిస్తే నార్కో?టిక్ డ్రగ్ ట్రాఫికింగ్,మనీ ల్యాండరింగ్ విభాగం చర్యలు తీసుకుంటుందని హెచ్చరించారు.ఇక ఇన్వెస్టర్లు ఎవరైనా విదేశాల నుంచి క్రిప్టోను భారత్‌కు తీసుకువస్తే వారి నుంచి ఈక్వలైజేషన్ లెవీని కట్టించుకోమని స్పష్టం చేశారు.ఈక్వలైజేషన్ లెవీ (ట్యాక్స్) కేవలం ఈకామర్స్ సంస్థలకు వర్తిస్తుందని, ఇన్వెస్టర్లు వర్తించదని నిర్మలా సీతారామన్ వెల్లడించారు. మనదేశంలో డిజిటల్ కరెన్సీని దశలవారీగా అమలు చేసే అంశంపై ఆర్బీఐ కసరత్తులు చేస్తోంది.ఇప్పటికే హోల్‌సేల్,రిటైల్ విభాగంలోనే త్వరలోనే దీన్ని ప్రయోగాత్మకంగా ప్రారంభించే అవకాశం ఉందని ఆర్‌బీఐ డిప్యూటీ గవర్నర్ టి.రవిశంకర్ ప్రకటించిన విషయం తెలిసిందే. అయితే ఇదే సమయంలో దేశంలో క్రిప్టో కరెన్సీపై తలెత్తున్న అనుమానాలకు కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ చెక్ పెట్టారు.

## కోవిడ్ నివారణ చర్యలపై సీఎం వైఎస్ జగన్ సమీక్ష



తాడేపల్లి ( విభారె) : ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బుధవారం కరోనా వైరస్ నివారణ చర్యలపై తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యాక్సినేషన్ వేగవంతం చేయడంపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. థర్డ్ వేవ్ వస్తే తీసుకోవాల్సిన చర్యలపై సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ.. "కాన్సన్‌ట్రేటర్లు, డీటైప్‌సిలెండర్లు, ఆక్సిజన్ ప్లాంట్ల నిర్వహణపై శ్రద్ధవహించాలి. దీనికోసం ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేయాలి. పీహెచ్‌సీల్లో ఆక్సిజన్ కాన్సన్‌ట్రేటర్లు ఉంచాలి. జిల్లాల వారీగా వీటి నిర్వహణ కోసం ప్రత్యేకంగా సిబ్బందిని నియమించాలి. ఏపీఎంఎస్ఐడీసీలో ప్రత్యేక సెల్‌ను ఏర్పాటుచేయాలి" అని అధికారులను ఆదేశించారు.అనంతరం ప్రైవేట్ ఆస్పత్రుల్లో ఆక్సిజన్ జనరేషన్ ప్లాంట్ల ఏర్పాటుపై సమీక్షలో.. "100 బెడ్లు ఉన్న ఆస్పత్రుల్లో ఆక్సిజన్ ప్లాంట్ ఏర్పాటు చేయించే దిశగా చర్యలు తీసుకోవాలి. తర్వాత మిగిలిన ఆస్పత్రుల్లో ఆక్సిజన్ ప్లాంట్ల ఏర్పాటుపై దృష్టిపెట్టాలి. ప్లాంట్ల ఏర్పాటుకు 30 శాతం సబ్సిడీ ఇస్తున్నాం. కొత్త మెడికల్ కాలేజీల కోసం పెండింగ్‌లో ఉన్న భూసేకరణ పూర్తిచేయాలి. వ్యాక్సినేషన్‌లో టీచర్లకు ప్రాధాన్యత ఇవ్వాలి. వీలైనంత త్వరగా టీచర్లకు వ్యాక్సినేషన్‌ను పూర్తిచేయాలి" అని అధికారులను ఆదేశించారు. మే, జూన్, జులై నెలల్లో ప్రైవేట్ ఆస్పత్రులకు 43.38 లక్షల డోసులు ఇస్తే.. కేవలం 5,24,347 డోసులు మాత్రమే వాడారని అధికారులు సీఎంకు తెలిపారు. ఈ వ్యాక్సిన్లను ప్రభుత్వానికి ఇస్తే వ్యాక్సినేషన్‌ను వేగంగా ముందుకు సాగుతుందని, దీనిపై మరోసారి కేంద్రానికి లేఖ రాస్తానని సీఎం వైఎస్ జగన్ అన్నారు."ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ఆక్సిజన్ కాన్సన్‌ట్రేటర్లు అందుబాటులో ఉంచాలి. కోవిడ్ నివారణ చర్యల్లో భాగంగా ప్రభుత్వం కొనుగోలు చేసిన కాన్సన్‌ట్రేటర్లు, డీ?టైప్ సిలెండర్లు, ఆక్సిజన్ జనరేషన్ (పీఎస్‌ఏ) ప్లాంట్ల నిర్వహణ కోసం ప్రత్యేక శ్రద్ధ వహించాలి. ఇందుకోసం ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేయాలి. జిల్లాల వారీగా నిర్వహణ కోసం ప్రత్యేక సిబ్బందిని నియమించాలి. జిల్లా విస్తీర్ణం, ఆస్పత్రుల సంఖ్యను బట్టి తగిన సిబ్బందిని ఏర్పాటు చేయాలి. అవసరమైన శిక్షణనూ వీరికి అందించాలి. ఏపీఎంఎస్ఐడీసీలో ప్రత్యేక సెల్ ఏర్పాటు చేయాలి. శిక్షణ అనంతరం వీరిని ఆస్పత్రి మేనేజ్‌మెంట్‌కు అప్పగించాలి" అని సీఎం జగన్ ఆదేశించారు.అదే విధంగా... "ఐటీఐ, డిప్లమోలో దీనికి సంబంధించిన కోర్సులను ప్రవేశపెట్టాలి. ఆస్పత్రుల నిర్వహణలో కీలకమైన ఆక్సిజన్ ప్లాంట్ల నిర్వహణ, ఎలక్ట్రికల్, ఏసీ రిపేర్, ప్లంబింగ్‌తో పాటు ఇతర అనుబంధ వైద్య విభాగాల్లో నైపుణ్యాలను అభివృద్ధి చేయాలి. నైపుణ్యం ఉన్న మానవ వనరుల సేవల కారణంగా... ఆస్పత్రుల నిర్వహణ మెరుగ్గా ఉంటుంది. అంతేగాక చాలామందికి ఉద్యోగాలు వస్తాయి" అని సీఎం జగన్ అన్నారు.

## ఆకస్మిక వరదలపై పరిస్థితిని సమీక్షిస్తున్నాం: మోదీ




న్యూఢిల్లీ: జమ్మూకశ్మీర్‌లోని కిష్టర్, కార్గిల్‌లో ఆకస్మిక వరదలపై పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నట్లు ప్రధాని నరేంద్ర మోదీ తెలిపారు. కేంద్రం అన్నివిధాలా ఆదుకుంటుందని భరోసా ఇచ్చారు. అందరూ క్షేమంగా ఉండాలని ప్రార్థిస్తున్నట్లు ఓ ట్వీట్‌లో ప్రధాని పేర్కొన్నారు. దీనికి ముందు, కిష్టర్‌లో పరిస్థితిపై లెఫ్టినెంట్ గవర్నర్, జమ్మూకశ్మీర్ డీజీపీతో మాట్లాడినట్టు కేంద్ర హోం మంత్రి అమిత్‌షా పేర్కొన్నారు.కాగా, ఆకస్మిక వరదల్లో గల్లంతైన వారిని కాపాడేందుకు ఆర్మీ, ఎన్‌డీఆర్ఎఫ్ బృందాలను రంగంలోకి దింపినట్టు జమ్మూకశ్మీర్ లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా మీడియాకు తెలిపారు.

గులాబ్‌గఢ్ ప్రాంతంలో బుధవారం ఉదయం మెరుపు వరదలు ముంచెత్తడంతో 30 నుంచి 40 మంది జాడ గల్లంతైందని, నాలుగుకు పైగా మృతదేహాలను వెలికి తీశారని కిష్టర్ జిల్లా డిప్యూటీ కమిషనర్ తెలిపారు. హాంజర్ గ్రామంలో తొమ్మిది ఇళ్లు ధ్వంసమయ్యారు. సహాయక కార్యక్రమాలు ముమ్మరంగా సాగుతున్నట్టు చెప్పారు.

## బసవరాజు అనే నేను.. కర్నాటక సిఎంగా

బెంగళూరు: కర్నాటక ముఖ్యమంత్రిగా బసవరాజు బొమ్మై ప్రమాణ స్వీకారం చేశారు. 20వ ముఖ్యమంత్రిగా బుధవారం ఉదయం 11 గంటలకు బసవరాజు చేత గవర్నర్ తాహార్ చాంద్ గెహ్లోట్ ప్రమాణ స్వీకారం చేయించారు. బసవరాజు కూడా లింగాయత్ వర్గానికి చెందినవారే. లింగాయత్ ఓట్లే బిజెపిని అధికారంలోకి తీసుకొచ్చాయి. 1998 నుంచి 2008 వరకు ఎంఎల్‌సిగా రెండు సార్లు గెలిచారు. 2008లో జెడిఎస్ నుంచి బిజెపిలో చేరారు. షిగ్గోన్ నియోజకవర్గం నుంచి ఎంఎల్ఎ గెలుపొందారు.



2008 నుంచి 2013 వరకు నీటి పారుదల శాఖ మంత్రిగా పని చేశారు. లింగాయత్ వర్గానికి చెందిన వ్యక్తి కావడమే కాకుండా యెడియూరప్పకు అత్యంత సన్నిహితుడు కావడంతో ఆయన వైపు బిజెపి అధిష్టానం మొగ్గుచూపింది. ఉత్తర కర్నాటకలోని షిగ్గాన్ నియోజకవర్గంనుంచి మూడు సార్లు ఎంఎల్ఎగా ఎన్నికయ్యారు. యెద్యూరప్ప మంత్రివర్గంలో హోంమంత్రిగా పని చేసిన అనుభవం ఉంది.

## జమ్ములో భారీ వర్షాలు..

7గురు మృతి, 30 మంది గల్లంతు

కిశ్వార్: జమ్ముకశ్మీర్‌లోని కిశ్వార్ జిల్లాలో భారీ వర్షాలు బీభత్సం సృష్టించాయి. దాంతో బుధవారం తెల్లవారుజామునా అకస్మాత్తుగా వచ్చిన వరదలకు హ్వాంజార్ గ్రామంలో ఏడుగురు మృతి చెందారు. దాదాపు 30 మంది ఆచూకీ గల్లంతయిందని అధికారులు వెల్లడించారు. అలాగే ఈ ఘటనలో పలు ఇళ్లు కూడా ధ్వంసమయ్యాయి. ఘటనాస్థలంలో సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. అత్యవసర పరిస్థితుల్లో వైమానిక దళం సేవలు కూడా ఉపయోగించుకోనున్నట్లు కేంద్రమంత్రి జితేంద్ర సింగ్ వెల్లడించారు.గత కొద్దిరోజులుగా జమ్ములోని పలు ప్రాంతాల్లో భారీ వర్షాలు కురుస్తున్నాయి. ఈ నెలాఖరు వరకు ఈ వానలు ఇలాగే కొనసాగుతాయన్న నివేదికల మధ్య.. అధికారులు ప్రజలను అప్రమత్తం చేశారు. వరదలు, కొండ చరియలు విరిగిపడే ముప్పు ఉన్న ప్రాంతవాసులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.


పర్యవేక్షిస్తోన్న మోదీ, అమిత్ షా..

కిశ్వార్, కార్గిల్‌లో నెలకొన్న వాతావరణ పరిస్థితిని కేంద్రం నిశితంగా పరిశీలిస్తోందని ప్రధాని మోదీ అన్నారు. ప్రభావిత ప్రాంతాల్లో సహాయక చర్యలకు కేంద్రం సంసిద్ధంగా ఉన్నట్లు చెప్పారు. ప్రతిఒక్కరి క్షేమం కోసం ప్రార్థిస్తున్నట్లు చెప్పారు. కేంద్రమంత్రి అమిత్ షా ఘటనా స్థలంలోని జరుగుతోన్న సహాయక చర్యలను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు. వాటిపై అధికారులతో సమీక్షిస్తున్నట్లు వెల్లడించారు. అలాగే మృతుల కుటుంబాలకు సంతాపాన్ని తెలియజేశారు.



## 14 రోజుల రిమాండ్.. రాజమండ్రి జైలుకు దేవినేని ఉమా

కృష్ణా జిల్లా:( విభారె) టీడీపీ మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావును అరెస్టు చేసిన పోలీసులు ఆయనను ఆన్‌లైన్‌లో న్యాయమూర్తి ఎదుట ప్రవేశపెట్టారు. హనుమాన్ జంక్షన్ పోలీస్ స్టేషన్ నుంచి జూమ్ యాప్ ద్వారా కోర్టు ముందు హాజరుపరిచారు. ఈ క్రమంలో.. కోర్టు ఆయనకు 14 రోజుల పాటు రిమాండ్ విధించింది. దీంతో పోలీసులు దేవినేని ఉమాను రాజమండ్రి జైలుకు తరలించారు.



## ఫీజు రీఎంబర్స్ మెంట్ తో విద్యార్థుల జీవితాల్లో వెలుగులు నింపిన సీఎం జగన్



- నిరుపేద విద్యార్థులు కూడా పెద్ద చదువులు చదవాలి
- రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి కొడాలి నాని

గుడివాడ, జూలై 28 ( విభారె) రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న విద్యాదీవెన పథకం (ఫీజు రీఎంబర్స్ మెంట్) ద్వారా సీఎం జగన్మోహనరెడ్డి పేద విద్యార్థుల జీవితాల్లో వెలుగులు నింపారని రాష్ట్ర పౌరసరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి కొడాలి శ్రీవెంకటేశ్వరరావు (నాని) అన్నారు. బుధవారం కృష్ణాజిల్లా గుడివాడ పట్టణం రాజేంద్రనగర్లోని నివాసంలో మంత్రి కొడాలి నానిని పట్టణానికి చెందిన కొంకితల ఆంజనేయప్రసాద్ కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన కుమారుడు అజయ్ తెలంగాణా రాష్ట్రం బాచుపల్లిలోని గోకరాజు గంగరాజు ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్ సీఎస్ఈ కోర్సును పూర్తి చేశాడని చెప్పారు. ఒక ప్రైవేట్ కంపెనీలో ఉద్యోగం వచ్చిందని, అయితే అజయ్ కు సంబంధించిన సర్టిఫికెట్లను ఇవ్వడానికి కళాశాల యాజమాన్యం నిరాకరిస్తోందన్నారు. బీటెక్ చదువుకు సంబంధించి ఫీజు రీఎంబర్స్ మెంట్ మంజూరైందని, అయితే కళాశాల యాజమాన్యం మాత్రం ఫీజు రీఎంబర్స్ మెంట్ తమ అకౌంట్ కు జమ కాలేదని చెబుతోందన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మంజూరు చేసిన ఫీజు రీఎంబర్స్మెంట్ మొత్తం గోకరాజు గంగరాజు కళాశాలకు జమ అయ్యేలా చూడాలని కోరారు. దీనిపై మంత్రి కొడాలి నాని మాట్లాడుతూ ఈ విషయాన్ని కళాశాల యాజమాన్యంతో మాట్లాడతానని, ఏవైనా సమస్యలు వస్తే సీఎం జగన్మోహనరెడ్డి దృష్టికి తీసుకువెళ్ళి పరిష్కరిస్తానని చెప్పారు. అనంతరం మంత్రి కొడాలి నాని మాట్లాడుతూ అర్హత ఉన్న ప్రతి విద్యార్థికీ సకాలంలో, ఎటువంటి బకాయిలు లేకుండా పూర్తి ఫీజు రీఎంబర్స్ మెంట్ చేయాలన్నది రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమన్నారు. నిరుపేద విద్యార్థులు కూడా పెద్ద చదువులు చదవాలని ఫీజు రీఎంబర్స్ మెంట్ ను పూర్తిస్థాయిలో అమలు చేయడం జరుగుతోందన్నారు. ఫీజు రీఎంబర్స్ మెంట్ కోసం విద్యార్థులు ఎదురు చూడకూడదని, తల్లిదండ్రులు అప్పుల పాలు కాకూడదని సీఎం జగన్ పదేపదే చెబుతూ వస్తున్నారన్నారు. దీనిలో భాగంగా ఈ ఏడాది ఏప్రిల్ నెల్లో తొలి విడతగా 10 లక్షల 88 వేల 439 మంది విద్యార్థులకు రూ. 671.45 కోట్లను నేరుగా విద్యార్థుల తల్లుల ఖాతాల్లో వేశామన్నారు. రెండవ విడత దాదాపు 10.97 లక్షల మంది విద్యార్థులకు రూ.693.81 కోట్లు జమ చేసేందుకు ప్రభుత్వం సన్నాహాలు చేస్తోందన్నారు. 2018-19 విద్యా సంవత్సరానికి చెల్లించాల్సిన గత ప్రభుత్వ హయాంలోనూ బకాయిలు రూ.1774.60 కోట్లను సీఎం జగన్ అధికారంలోకి రాగానే చెల్లించారన్నారు.

## త్వరలో 2.62 లక్షల టిడ్కో ఇళ్లు పూర్తి చేస్తాం: మంత్రి బొత్స

అమరావతి:( విభారె) టిడ్కో, మెప్మా, బ్యాంక్ సమన్వయకర్తలతో రాష్ట్ర మున్సిపల్ శాఖ మంత్రి బొత్స సత్యనారాయణ బుధవారం టెలికాన్ఫరెన్స్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. త్వరలో 2.62 లక్షల టిడ్కో ఇళ్లు పూర్తి చేస్తామని తెలిపారు. అదే విధంగా, మౌళిక వసతుల కల్పన పనులకు ప్రత్యేకమైన ప్రాధాన్యత ఉంటుందని పేర్కొన్నారు .లబ్ధిదారులకు ఏలాంటి ఇబ్బందులు తలెత్త కుండా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. కాగా, పనుల పురోగతిపై ప్రతి వారం సమీక్షను నిర్వహిస్తామని తెలియ జేశారు. లబ్ధిదారులకు రుణాల మంజూరు చేసే ప్రక్రియపై ప్రత్యేకంగా దృష్టి సారించాలని అధికారులకు సూచించారు.

## విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణపై హైకోర్టులో కేంద్రం అఫిడవిట్

అమరావతి( విభారె) : విశాఖపట్నం స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణపై కేంద్ర ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్ హైకోర్టులో బుధవారం అఫిడవిట్ దాఖలు చేసింది. కేంద్రం తన అఫిడవిట్‌లో పలు కీలక అంశాలను పొందుపరిచింది. స్టీల్‌ప్లాంట్‌లో ఉద్యోగులకు రాజ్యాంగ భద్రత ఉందనేది సరికాదని, అవసరమైతే ప్రభుత్వ ఉద్యోగులను తొలగిస్తామని పేర్కొంది. ఉద్యోగులు స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ వద్దనడం సరికాదని తెలిపింది.ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలో కేబినెట్ నిర్ణయం తీసుకుందని, స్టీల్‌ప్లాంట్‌ను 100శాతం ప్రైవేటీకరణ చేస్తామని అఫిడవిట్‌లో చెప్పింది. ఇప్పటికే బిడ్డింగ్‌లు ఆహ్వానించామని పేర్కొంది. అదే విధంగా విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణపై పిల్ వేసిన జేడీ లక్ష్మీనారాయణ విశాఖ ఎన్నికల్లో పోటీచేశారని, రాజకీయ



లబ్ధి కోసమే ఆయన పిటిషన్ వేశారని తెలిపింది. ఈ పిటిషన్‌కు విచారణ అర్హత లేదని కేంద్రం ప్రభుత్వం ఏపీ హైకోర్టుకు సమర్పించిన అఫిడవిట్‌లో పేర్కొంది.

# సంపాదకీయం

గురువారం 29 జూలై 2021

## సహకారం కోసమేనా భేటీ

ప్రధాని మోదీ, సీనియర్ నేత శరద్ పవార్ తాజా భేటీపై రాజకీయ వర్గాల్లో ఆసక్తికరమైన చర్చ జరుగుతోంది. రాజకీయంగా భిన్న ధృవాలైన ఇద్దరు నేతలు ఏ విషయంపై చర్చించి ఉంటారన్న అంశంపై ఎవరికి తోచిన రీతిలో వారు ఊహాగానాలు చేస్తున్నారు. శరద్ పవార్ తెర వెనక ఉండి నడిపించే మహారాష్ట్రలోని మహావికాస్ అగఢీ సంకీర్ణ సర్కారు ఇటీవల కాలంలో అనేక ఇబ్బందులు ఎదుర్కొంటోంది. దాని మనుగడకు సంబంధించి మరాటా దిగ్గజం మోదీని కలసి ఉంటారన్న అంచనాలు ఉన్నాయి. పైకి కాదన్నప్పటికీ వచ్చే ఏడాది జరిగే రాష్ట్రపతి ఎన్నికకు విపక్షాల ఉమ్మడి అభ్యర్థిగా పవార్ పేరు బలంగా వినపడుతోంది. అసలు విపక్షాల నేతగా ప్రధాని పదవికి సైతం ఆయన పేరుపై రాజకీయ వర్గాల్లో జోరుగా చర్చ నడుస్తోంది. ఈ నేపథ్యంలో ప్రత్యేకంగా ప్రధాని, శరద్ పవార్ భేటీపై ఆసక్తి కలగడం సహజం.విశ్వసనీయ సమాచారం ప్రకారం ఇద్దరు నేతల భేటీకి ప్రత్యేకమైన కారణం ఉంది. ఇటీవల మంత్రివర్గ విస్తరణలో ప్రధాని కొత్తగా సహకారశాఖ ను ఏర్పాటు చేసి, దానికి సారథిగా తనకు కుడి భుజమైన హోంమంత్రి అమిత్ షా ను నియమించారు. పైకి ఎన్ని చెప్పినప్పటికీ సహకార రంగంలో పాతుకుపోయిన కొన్ని ప్రాంతీయ పార్టీలను దెబ్బతీయడానికే కొత్త మంత్రిత్వశాఖను ఏర్పాటు చేశారన్నది చేదునిజం. మహారాష్ట్ర రాజకీయాలను ప్రభావితం చేసే శక్తి రాష్ట్ర సహకార చక్కెర లాబీయింగ్ కు ఉంది. రాష్ట్రంలో చక్కెర కర్మాగారాలపైశరద్ పవార్ పార్టీ అయిన ఎన్సీపీకి పట్టుంది. దీనిని అడ్డం పెట్టుకుని ఆ పార్టీ నాయకులు బాగా లబ్ధి పొందారు. రుణాలు తీసుకుని చెల్లించలేదనే ఆరోపణలు ఉన్నాయి. దీనికి సంబంధించి శరద్ పవార్ మేనల్లుడు, ఉప ముఖ్యమంత్రి అయిన అజిత్ పవార్ సమీప బంధువులపై కేసులు నమోదయ్యాయి. తాజాగా బకాయిల చెల్లింపునకు సంబంధించి ఎన్సీపీ నేతలపై ఒత్తిడులు అధికమవుతున్న నేపథ్యంలో ప్రధానితో పవార్ భేటీపై సహజంగానే ఆసక్తి కలుగుతుంది.తాజాగా ఎన్సీపీ నాయకుడు, మొన్నటిదాకా హోంమంత్రిగా పనిచేసిన అనిల్ దేశ్ ముఖ్, ఆ పార్టీకి చెందిన మరో నాయకుడు ఏక్ నాథ్ ఖడ్సేలపై వచ్చిన అవినీతి ఆరోపణలకు సంబంధించి కేంద్ర దర్యాప్తు సంస్థలు వేగంగా ముందుకు సాగుతున్నాయి. ఈ పరిస్థితుల్లో అధికార భాజపాతో అనవసరంగా గొడవలకు దిగితే రాజకీయంగా నష్టపోతామన్న అభిప్రాయం ఎన్సీపీ వర్గాల్లో ఉంది. అందుకే సయోధ్య కుదుర్చుకునే చర్యల్లో భాగంగా శరద్ పవార్ చొరవ తీసుకుని ప్రధానితో భేటీ అయ్యారన్న విశ్లేషణలు ఢిల్లీ రాజకీయ వర్గాల్లో వినిపిస్తున్నాయి. మూడుసార్లు ముఖ్యమంత్రిగా, పీవీ హయాంలో రక్షణమంత్రిగా, మన్మోహన్ వద్ద వ్యవసాయమంత్రిగా, కీలకమైన బీసీసీఐ ఛైర్మన్ గా, లోక్ సభలో ప్రతిపక్ష నేతగా పనిచేసిన శరద్ పవార్ కు రాజకీయ పరమైన సిద్ధాంతాలు, విధానాల బాదరబందీ అంటూ ప్రత్యేకంగా ఏమీ లేదు.పరిస్థితులను బట్టి రాజకీయంగా ముందుకు సాగడమే ఆయనకు తెలుసు. అందుకే 34ఏళ్ల పిన్న వయసులో 1978లో రాష్ట్రానికి శరద్ పవార్ ముఖ్యమంత్రి కాగలిగారు. 50ఏళ్ల వయసులో 1991లో రాజీవ్ గాంధీ హత్యానంతరం ప్రధాని పదవికి పీవీతో పోటీపడ్డారు. అవకాశాలను ఉపయోగించుకుని వేగంగా ముందుకు వెళ్లడమన్నది పవార్ కు వెన్నతో పెట్టిన విద్య. అదే సమయంలో పరిస్థితులు సానుకూలంగా లేనప్పుడు వెనక్కు తగ్గడమూ ఈ మరాఠా నేతకు తెలిసినంతగా మరో నేతకు తెలియదు. అందుకే ఎనిమిది పదుల వయసులోనూ పట్టుమని 20 మంది ఎంపీలు లేనప్పటికీ ఈ బారామతి నేత హస్తిన రాజకీల్లో నేటికీ క్రియాశీలకంగా ఉన్నారు. కాలం కలసివస్తే 2024లో ప్రధాని అవుతానని శరద్ పవార్ కలలు కంటున్నారు.

# మిర్చి..భలే హాట్ గురూ...



గుంటూరు, జూలై 28, (న్యూస్ పల్స్)గుంటూరు నుంచి వివిధ దేశాలకు మిర్చి ఎగుమతులు మళ్లీ నిలిచాయి. ఏటా చైనా, బంగ్లాదేశ్, శ్రీలంక, సింగపూర్, థారులాండ్, స్విజ్జర్లాండ్ తదితర దేశాలకు రెండు నుంచి రెండున్నర లక్షల క్వింటాళ్ల వరకు మిర్చి ఎగుమతి అయ్యేది. కరోనా నేపథ్యంలో రెండేళ్లుగా చైనాతో పాటు పలు దేశాలకు ఎగుమతులు ఆశాజనకంగా లేవు. గతేడాది లాక్‌డౌన్ తర్వాత తిరిగి కొన్ని నెలల పాటు ఎగుమతులు పునర్ ప్రారంభమయ్యాయి. కరోనా మొదటి దశ ప్రభావం తగ్గిన తర్వాత మూడు నెలలపాటు ఎగుమతులు జరిగాయి. 2020-21 ఆర్థిక సంవత్సరంలో కేవలం లక్షన్నర క్వింటాళ్లే ఎగుమతి అయ్యాయి. కరోనా రెండో దశతో ఎగుమతులు మళ్లీ నిలిచాయి. ప్రస్తుతం వివిధ దేశాల్లో కరోనా మూడో దశ ప్రభావంతో లాక్‌డౌన్, రవాణాపై ఆంక్షలు తదితర కారణాలతో నాలుగు నెలలుగా ఎగుమతులు లేవు. పాకిస్తాన్, చైనాలో మిర్చి ఉత్పత్తులు బాగా పెరిగి వారు భారత్ నుంచి దిగుమతులు గణనీయంగా తగ్గించారని గుంటూరులో మిర్చి వ్యాపారి పులగం సురేష్‌రెడ్డి తెలిపారు.ఈ ఏడాది వివిధ దేశాలకు ఎగుమతులు లేకున్నా దేశీయ అవసరాలకే ఎక్కువగా వివిధ రాష్ట్రాల నుంచి ఆర్డర్లు వస్తున్నాయి. కారం, మసాలా కారం, అయిల్ తయారీ, ఇతర అనుబంధ ఉత్పత్తుల తయారీ కోసం ఇతర రాష్ట్రాల నుంచి ఆర్డర్లు భారీగా రావడం వల్ల గతేడాది నుంచి ధరలు తగ్గకుండా రైతులకు మద్దతు ధర లభిస్తోంది. తేజ, బాడిగ రకాలు ఇప్పటి వరకు క్వింటాలుకు రూ.14 వేల నుంచి రూ.16 వేల వరకు సగటు ధరలు లభించాయి. మిగిలిన రకాలకు క్వింటాలుకు రూ.10 వేల నుంచి రూ.12 వేల వరకు ధరలు స్థిరంగా ఉన్నాయి. తెలుగు రాష్ట్రాల్లో గుంటూరు, వరంగల్, ఖమ్మం నుంచి ఎక్కువగా ఎగుమతులవుతాయని వ్యాపారులు తెలిపారు. గుంటూరు మార్కెట్ ఆసియాలోనే అతిపెద్ద మార్కెట్‌గా అభివృద్ధి చెందింది. మిర్చికి పెట్టుబడులు భారీగా పెరిగినా ఉత్పత్తులు, ధరలు ఆశాజనకంగా ఉండటంతో రైతులు ఈ పంటపై ఎక్కువగా ఆసక్తి చూపుతున్నారు.వివిధ దేశాలకు ఎగుమతులుతగ్గినా దేశీయంగా రాష్ట్రంలో పండిన మిర్చికి డిమాండ్ ఉందని మిర్చి యార్డుచైర్మన్ చంద్రగిరి ఏసురత్నం తెలిపారు. ప్రస్తుతం వివిధ ప్రాంతాల్లో కోల్డ్ స్టోరేజీల్లో 60లక్షల టిక్కీల నిల్వలున్నాయని, ప్రస్తుతం యార్డుకు రైతులు తక్కువసంఖ్యలో వస్తున్నారని, కోల్డ్ స్టోరేజీల్లోని సరుకే యార్డుకు వస్తోందని చెప్పారు.గుంటూరు మిర్చి యార్డులోఏటా రూ.6 వేల కోట్ల టర్నోవర్ యథాతథంగా జరుగుతోందని తెలిపారు. గుంటూరు నుంచి వివిధ చిల్లీస్ పౌడర్‌లకు దేశ వ్యాప్తంగా మంచి డిమాండ్ ఉందని చెప్పారు.

# ప్రజా సమస్యలపై జేడీ దృష్టి



ఒంగోలు, జూలై 28, (న్యూస్ పల్స్)జేడీ లక్ష్మీనారాయణ ఇప్పుడు మళ్లీ ప్రజా సమస్యలపై దృష్టి పెట్టారు. ఐపీఎస్‌ను వదులుకుని.. గత ఎన్నికలకు ముందు జేడీ లక్ష్మీనారాయణ జనసేన పార్టీలో చేరారు. ఈ క్రమంలోనే విశాఖ ఎంపీ స్థానం నుంచి ఆయన పోటీ చేశారు. ఆ ఎన్నికల్లో జేడీ లక్ష్మీనారాయణ పరాజయం పాలయ్యారు. విశాఖ ఎంపీగా ఖచ్చితంగా గెలుస్తారని అంచనాలు ఉన్న నేపథ్యంలో ఆయన మూడో స్థానంతో సరిపెట్టుకున్నారు. అయినప్పటికీ.. ఆయన ప్రజల మధ్యే ఉంటానని.. వారి సమస్యలపై పోరాటం చేస్తానని ప్రకటించారు. అయితే.. ఇంతలోనే కరోనా రావడంతో కొన్నాళ్లు దూరంగా ఉన్నారు.అదేసమయంలో జేడీ లక్ష్మీనారాయణ కొన్నాళ్లు వ్యవసాయం వైపు మొగ్గు చూపి.. రైతుల కష్టాలు తెలుసుకున్నారు. ఇక, జనసేన అధినేత పవన్.. రాజకీయాల్లో ఉంటానని చెప్పి సినిమాల్లోకి వెళ్లిపోవడాన్ని సహించలేక ఏకంగా ఆయన జనసేన సభ్యత్వానికి రాజీనామా చేశారు. అయితే.. ఆయన కొన్నాళ్లుగా స్తబ్దుగా ఉన్నప్పటికీ.. ఇప్పుడు మరోసారి యాక్టివ్ అయ్యారు. ప్రస్తుతం రాష్ట్రాన్ని కుదిపేస్తున్న విశాఖపట్నం ఉక్కు కర్మాగారం ప్రైవేటీకరణ విషయంలో జేడీ లక్ష్మీనారాయణ అందరిలాగా కాకుండా.. వ్యూహాత్మకంగా అడుగులు వేస్తున్నారు. నిజానికి ఇప్పటికే చాలా రాజకీయ పార్టీలు విశాఖ ఉక్కు కోసం అంటూ.. జెండాలు పట్టుకున్న విషయం తెలిసిందేఇక, స్థానిక ఎమ్మెల్యే , మాజీ మంత్రి గంటా శ్రీనివాసరావు తన పదవికి రాజీనామా కూడా చేశారు. అయితే వీరిలా జెండాలు పట్టుకుని రోడ్డెక్కి నినదించడం కంటే.. న్యాయపోరాటం బెటర్ అనుకున్న.. జేడీ లక్ష్మీనారాయణ విశాఖ ఉక్కు ప్రైవేటీకరణను అడ్డుకోవాలని.. ఇది రాజ్యాంగ విరుద్ధమని పేర్కొంటూ.. హైకోర్టులో న్యాయ పోరాటానికి దిగారు. దీనిపై ఇప్పటికే రెండు మూడు సార్లు విచారణ జరిపిన కోర్టు.. కేంద్రానికి ఇటీవల గట్టిగానే షాకిచ్చింది. ఎప్పటికప్పుడు కౌంటర్ దాఖలు చేసేందుకు సమయం కోరడాన్ని తప్పుబట్టింది.ఈ దఫా ఆఖరి అవకాశమని.. పేర్కొంటూ.. కోర్టు.. ఈ కేసు విచారణను ఆగస్టు 2వ తేదీకి వాయిదా వేసింది. అయితే.. ఈ మొత్తంఎపిసోడ్‌లో హైకోర్టు కనుక ప్రైవేటీకరణపై స్టే విధిస్తే.. ఇక్కడి కార్మికులకు ఉపశమనం దక్కుతుందని అంటున్నారు పరిశీలకులు. దీనికి కారణమైన జేడీ లక్ష్మీనారాయణకి ప్రజల నుంచి మద్దతు లభించడంతోపాటు.. ఆయన పుంజుకునే అవకాశం కూడా ఉంటుందని అంటున్నారు. ఏదేమైనా కొన్నాళ్లుగా సైలెంట్‌గా ఉన్న జేడీ లక్ష్మీనారాయణ మళ్లీ ఇప్పుడు రాజకీయంగా యాక్టివ్ అవుతుండడం ఆసక్తిగా మారింది.

### పోలవరం తప్పటడుగులు ఎవరివి...

# చంద్రబాబా... జగనా..

ఏలూరు, జూలై 28, (న్యూస్ పల్స్)ఏపీకి ప్రత్యేక హోదా అవసరం లేదు. ప్యాకేజీ ఇప్పించండి చాలు. పోలవరం సవరించిన అంచనాల ప్రకారం నిధులు, పునరావాస ప్యాకేజీ పై స్పష్టత ఇవ్వకపోయినా ఫరవాలేదు. జగన్ పై కేసులు మరింత బిగించి లోపలవేస్తే చాలు. ఈ తరహా రాజకీయంతో ఎన్డీఏ ప్రభుత్వంలో ఉండి కూడా కీలక అంశాల్లో చంద్రబాబు మోడీ సర్కార్ తో నాడు పడిన రాజీ ఆంధ్రప్రదేశ్ ప్రజల పాలిట శాపంగా మారిందంటారు విశ్లేషకులు. నాటి సర్కార్ పాపాలు నేటి ప్రభుత్వాన్ని వెంటాడుతున్నాయి. ఫలితంగా విభజన చట్టంలో ఇచ్చిన హామీలను సైతం అమలు చేసేందుకు కేంద్రం మోకాలు అడ్డుతుంది.వైసీపీ రాజ్యసభ సభ్యుడు విజయసాయి రెడ్డి పార్లమెంట్లో పోలవరంపై సంధించిన ప్రశ్న కు కేంద్రమంత్రి షెకావత్ ఇచ్చిన జవాబు పోలవరం నిధుల విడుదల లో మొండిచెయ్యి చూపిస్తామన్న క్లారిటీ లభించింది. పోలవరం ప్రాజెక్ట్ డిజైన్లు మార్పు వల్ల పెరిగిన అంచనా వ్యయంతో మాకు సంబంధం లేదు. 2014 లో ఉన్న లెక్క ప్రకారమే మేము సొమ్ములు చెల్లిస్తాం ఇది కేంద్రమంత్రి ఇచ్చిన జవాబు. ఇప్పటికే పునరావాస ప్యాకేజీ అమలు మాకు సంబంధం లేనట్లే కేంద్రం వ్యవహరిస్తోంది. దీనికి తోడు ప్రతీ ఏటా పెరిగే అంచనాలు తమకు సంబంధం లేనట్లు ప్రకటించడం చూస్తే ఆంధ్రప్రదేశ్ పై మోడీ సర్కార్ చూపిస్తున్న ప్రేమ ఎలాంటిదో చెప్పక్కర్లేదు.ఆంధ్రప్రదేశ్ విభజన బిల్లు పై రాజ్యసభలో చర్చ సందర్భంగా నాటి ప్రధాని మన్మోహన్ సింగ్ పోలవరం ప్రాజెక్ట్ పై స్పష్టంగా హామీ ఇచ్చారు. పెరిగే ప్రాజెక్ట్ వ్యయానికి అనుగుణంగా ఎంత అయితే అంత ఖర్చు జాతీయ ప్రాజెక్ట్ కు అందిస్తామన్నారు. పునరావాసానికి అయ్యే పూర్తి ఖర్చును కేంద్రమే భరిస్తుందని అభయమిచ్చారు. కానీ ఇప్పుడు మోడీ సర్కార్ సీన్ చూస్తే పూర్తి రివర్స్ లో ఉంది. నాటి యూపీఏ చేసిన చట్టం కానీ ఇచ్చిన హామీలు మాకు ఎలాంటి సంబంధం లేదన్నట్లు మోడీ ప్రభుత్వం నిస్సిగ్గుగా వ్యవహరిస్తున్నా అటు అధికార వైసీపీ ఇటు ప్రతిపక్ష టీడీపీ నిలదీయలేని నిశ్శహాయతలో నిలబడ్డాయి.చంద్రబాబు ఎన్డీఏ లో ఉండి చేసింది ఏమిటి అంటే పోలవరంను జాతీయ ప్రాజెక్ట్ ను కాస్తా రాష్ట్ర ప్రాజెక్ట్ గా చేసుకుని కేంద్రం నుంచి

డబ్బులు పిండుకోవాలని చూశారు. మేము అయితే శరవేగంగా పూర్తి చేస్తామని నీతి ఆయోగ్ ను బలవంతంగా ఒప్పించి చంద్రబాబు సెల్ఫ్ గోల్ వేసేసారు. అదే ఇప్పుడు కేంద్రానికి బలంగా మారింది. విభజన చట్టం ప్రకారం కేంద్రం కట్టించాలిసిన ప్రాజెక్ట్ ను తగుదున్నమ్మా అంటూ రాష్ట్రం చేపట్టడమే నేటి దుస్థితికి కారణమని విశ్లేషకులు అంటుంటారు. పోనీ చంద్రబాబు తరువాత అధికారంలోకి వచ్చిన జగన్ పోలవరం ప్రాజెక్ట్ ను మీరే పూర్తి చేయండని కేంద్రానికి అప్పగించినా ఇన్ని సమస్యలు వచ్చి ఉండేవి కావు. కానీ జగన్ సైతం చంద్రబాబు రూట్ లోనే వెళ్ళడంతో కేంద్రం ఏపీ సర్కార్ పై డ్యాన్స్ చేయడానికి ఆస్కారం కలిగిందన్నది వినిపిస్తుంది. మొత్తానికి నాడు బాబు నేడు జగన్ ప్రభుత్వాలు ముందు చూపు లేకుండా వేసిన అడుగులు ఏపీ వాసులను పోలవరంలో నిండా ముంచాయనడంలో సందేహం లేదు.

## మరోసారి పార్టీ మార్పు తప్పదా

విశాఖపట్టణం, జూలై 28, (న్యూస్ పల్స్)సీనియర్ నేత గంటా శ్రీనివాసరావు వచ్చే ఎన్నికల్లో ఏ పార్టీ నుంచి పోటీ చేస్తారు? టీడీపీలోనే ఉంటారా? మరో పార్టీకి జంప్ అవుతారా? అన్నది ఇప్పుడు విశాఖ ప్రాంతంలో చర్చనీయాంశమైంది. తెలుగుదేశం పార్టీ ఎమ్మెల్యేగా గెలిచినా గంటా శ్రీనివాసరావు ప్రస్తుతం యాక్టివ్ గా లేరు. రాజకీయాలకు దూరంగా ఉంటున్నారు. పార్టీ కార్యక్రమాల్లో కూడా పాల్గొనడం లేదు. ఆయన అనుచరులంతా వైసీపీలోకి జంప్ అయ్యారు.ఈ నేపథ్యంలో గంటా శ్రీనివాసరావు అడుగులు వచ్చే ఎన్నికల్లో ఎటువైపు పడతాయన్నది ఆసక్తికరంగా మారింది. గంటా శ్రీనివాసరావు వైసీపీలోకి రావాలనుకున్నా కొన్ని ఇబ్బందులున్నాయి. మిగిలిన వారిలా వైసీపీకి మద్దతిచ్చి ఎమ్మెల్యేగా ఉండదలచుకోలేదు. అందుకే తెలివిగా విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రయివేటీకరణను నిరసిస్తూ తన పదవికి రాజీనామా చేశారు. రాజీనామా ఆమోదం పొందకపోయినా గంటా శ్రీనివాసరావుకు మాత్రం మైలేజీని తెచ్చిపెట్టింది.ఉప ఎన్నిక జరిగినా తాను పోటీ చేయనని ఆయన స్పష్టం చేశారు. అంటే వచ్చే ఎన్నికల వరకూ తాను రాజకీయాలను పట్టించుకోనని చెప్పకనే చెప్పేశారు. గంటా శ్రీనివాసరావు తెలుగుదేశం పార్టీలో కంఫర్ట్ గా లేరు. ఆయన లోకేష్ నాయకత్వాన్ని తొలి నుంచి అంగీకరించడం లేదు. అయ్యన్న పాత్రుడికి ప్రాధాన్యత ఇవ్వడాన్ని కూడా అధికారంలో ఉన్నప్పటి నుంచి గంటా శ్రీనివాసరావు వ్యతిరేకిస్తూ వస్తున్నారు.ఇక భీమిలీ సీటు కూడా వచ్చే ఎన్నికల్లో తనకు టీడీపీ ఇవ్వదని తేలిపోయింది. దీంతో గంటా శ్రీనివాసరావు మరోసారి పార్టీ మారక తప్పదన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. వైసీపీలోకి వెళ్లినా ఎంపీ టిక్కెట్ తప్ప ఎమ్మెల్యేకు నో ఛాన్స్ అంటున్నారట. అందుకే గంటా శ్రీనివాసరావు ఆచితూచి అడుగులు వేస్తున్నారని తెలిసింది. జనసేనలోకి జంప్ చేసినా ఆశ్చర్యం లేదంటున్నారు. అధికారంలోకి రాకపోయినా కేంద్రంలో బీజేపీ పవర్ లో ఉంటుందన్న నమ్మకంతోనే గంటా శ్రీనివాసరావు అటువైపు చూస్తున్నారన్న టాక్ స్టీల్ సిటీలో వినిపిస్తుంది.

## కోర్టు మొట్టికాయలు తప్పవా...

గుంటూరు, జూలై 28, (న్యూస్ పల్స్)రాజకీయ నేతల కారణంగా.. పాలకులకు పరువు పోవడం, రావడం అనేవి సహజం. అధికార పార్టీలో ఉన్న నేతలు.. అత్యంత అప్రమత్తంగా వ్యవహరించాలి. లేనిపక్షంలో ఏ చిన్న తేడావచ్చినా.. అధికార పార్టీపైనా.. పాలకులపైనా ప్రభావం పడుతుంది. అందుకే.. పాలన చేసేవారు.. ఇటు పాలనపైనా.. అటు పార్టీపైనా కూడా ఓ కన్నేసి ఉంచుతారు. అయితే.. ఇప్పుడు జగన్ పాలనలో దీనికి భిన్నమైన పరిస్థితి కనిపిస్తోంది. వైసీపీ నేతల వల్ల.. చిన్న చిన్న ఇబ్బందులు వస్తుంటే.. జగన్ ప్రభుత్వంలోని సీనియర్ అధికారుల వ్యవహారంతో సీఎం పరువు బజారున పడుతోందని అంటున్నారు పరిశీలకులు.ఇటీవల కాలంలో రాష్ట్ర సర్కారులో పనిచేస్తున్న అధికారులపై హైకోర్టు కోర్టు ధిక్కరణ కేసులు నమోదు చేయిస్తోంది. ఆయా కేసులు ఏమన్నా.. భారీ ఎత్తున పెద్దవా అంటే అదేమీకాదు. అయినప్పటికీ.. కేసులు మాత్రం నమోదవుతున్నాయి. దీంతో ఆయా కేసుల విచారణ సందర్భంగా.. కోర్టు.. సంబంధిత అధికారులు ఏస్థాయిలో ఉన్నప్పటికీ.. కోర్టుకు పిలిచి బోనులో నిలబెడుతోంది. గతంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా ఉన్న నీలం సాహ్ని .. మూడు సార్లు కోర్టు మెట్లు ఎక్కారు. అదేవిధంగా డీజీపీ కూడా కోర్టు మెట్లు ఎక్కక తప్పలేదు.ఇక, ఇటీవల తాజాగా.. ప్రత్యేక కార్యదర్శి.. కేవీవీ సత్యనారాయణ కూడా కోర్టు ఆగ్రహానికి గురయ్యారు. ఈయనను వెంటనే అరెస్టు చేసి.. మేజిస్ట్రేట్ ముందుకు హాజరు పరచాలని న్యాయమూర్తి ఆదేశించడం.. ప్రభుత్వ వర్గాల్లో కలకలం సృష్టించింది. అయితే ఈ ఘటనలన్నింటినీ ప్రతిపక్షాలు సహా ప్రభుత్వ వ్యతిరేక మీడియా భూతద్దంలో చూస్తున్నాయి. జగన్‌ను పాలనను టార్గెట్ చేస్తూ.. పెద్ద ఎత్తున విమర్శలు వండివారుస్తున్నాయి. కానీ, నిజానికి కోర్టు మెట్లు ఎక్కుతున్న వారిని పరిశీలిస్తే.. వీరేమన్నా.. పెద్ద పెద్ద విషయాలకు సంబంధించి కోర్టుకు వెళ్తున్నారా ? అంటే అది లేదు.చిన్నపాటి ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయకపోవడం.. నాడు నేడు పనులకు సంబంధించి నిధులు, ఆఫీస్‌లకు రంగులు.. ఇలా.. చిన్న చిన్న విషయాల్లో అప్రమత్తంగా వ్యవహరించని కారణంగా.. కోర్టు ఆగ్రహానికి గురై.. వ్యక్తిగతంగా అధికారులు ఇబ్బంది పడుతూ.. అదే సమయంలో జగన్‌కు కూడా ఇబ్బందులు తెస్తున్నారని అంటున్నారు పరిశీలకులు. మరి ఈ పరిస్థితి మారాలంటే.. జగనే స్వయంగా దృష్టి పెట్టాలనే సూచనలు వస్తున్నాయి. మరి ఏం చేస్తారో చూడాలి.

## విశాఖ కలెక్టర్ గా బాధ్యతలు స్వీకరించిన మల్లికార్జున

విశాఖపట్నం జూలై 28, (న్యూస్ పల్స్) విశాఖ జిల్లా కలెక్టర్ గా డాక్టర్. మల్లికార్జున భాద్యతలు స్వీకరించారు.విశాఖ జిల్లా కలెక్టర్ గా వచ్చిన డాక్టర్. ఏ. మల్లికార్జున బాధ్యతలు చేపట్టేముందు అధికా రులు ఘనంగా స్వాగతం పలికారు. జిల్లా కలెక్టర్ గా ఉన్న వినయ్ చంద్ ను ప్రభుత్వం బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.ఆయన స్థానంలో డాక్టర్. మల్లికార్జునను నియమించింది. కలెక్టర్ మాట్లాడుతూ అన్ని సంక్షేమ పథకాలు ప్రజలకు అందేలా పని చేస్తాను. జిల్లా అధికారులను సమన్వయ పరచుకుని మరింతగా ప్రజాసేవలను అందిస్తాను. అన్ని వర్గాలకు సమ ప్రాధాన్యత ఇస్తానని అన్నారు.

# అసెంబ్లీ సీట్ల పెంపు దిశగా అడుగులు

విజయవాడ, జూలై 28, (న్యూస్ పల్స్)అధికారంలో ఉన్నవారికే అన్ని రకాలైన అడ్వాంటేజెస్ ఉంటాయి. ఇది చరిత్ర చెప్పిన సత్యం. ఏపీలో జగన్ ఇపుడు పవర్ లో ఉన్నారు. ఇక పొలిటికల్ గా పవర్ ఫుల్ గా ఉన్నారు. ఆయన్ని ఢీ కొట్టాలి అంటే ఇపుడున్న అస్త్రాలు ఆయుధాలు ఏ మాత్రం సరిపోవు అన్నది తెలుస్తున్నా కూడా అపర చాణక్యుడు చంద్రబాబుకు కొత్తగా ఏదీ తోచడంలేదు. దాంతో ఆయన చేష్టలుడిగి చూస్తున్నారు. వచ్చే ఎన్నికలు చంద్రబాబుకు అత్యంత కీలకం, ఒక్కమాటలో చెప్పాలి అంటే చివరి ఎన్నికలు. అదే టైమ్ లో జగన్ కి కూడా కీలకం కానీ చంద్రబాబు మాదిరిగా కాదు. ఇక 2024 ఎన్నికలు మోడీకి కూడా చావో రేవో లాంటివే. దాంతో మోడీ హ్యాట్రిక్ విజయాన్ని సాధించేందుకు మాస్టర్ ప్లాన్ వేస్తున్నారు. అది అటు తిరిగి ఇటు తిరిగి జగన్ కి వరంగా మారుతోందిట.దేశంలో 2024 నాటికి ఇపుడున్న ఎంపీ సీట్లను రెట్టింపు చేస్తారుట. బీజేపీలో హాట్ హాట్ గా వినిపిస్తున్న మ్యాటర్ ఇది. అంటే ఇపుడున్న ప్రతీ లోక్ సభ సీటు రెండుగా మారుతుందిట. 543 ఎంపీ సీట్లు వేయి సీట్లు అవుతాయట. అందుకోసమే కొత్త పార్లమెంట్ భవనం నిర్మాణం అని కూడా చెబుతున్నారు. శరవేగంగా నిర్మాణం అవుతున్నా నూతన పార్లమెంట్ 2022 నాటికి అందుబాటులోకి వస్తుంది. ఆ తరువాత రెండేళ్ళకు సార్వత్రిక ఎన్నికలు జరుగుతాయి. దీంతో వేయి మంది ఎంపీలతో 2024 తరువాత సభ కొలువు తీరేలా బీజేపీ సీట్లను పెంచుతుంది అంటున్నారు.వచ్చే ఎన్నికల్లో గెలవాలి అంటే సీట్లను పెద్ద ఎత్తున పెంచడమే మార్గమని బీజేపీ భావిస్తోందిట. దాని కోసం తెర వెనక సీరియస్ గానే కసరత్తు చేస్తున్నారు అంటున్నారు. ఆ విధంగా కనుక ఆలోచిస్తే ఏపీలో ఇపుడు ఉన్న సీట్లు డబుల్ అవుతాయి. అంటే యాభై ఎంపీ సీట్లు వస్తాయన్న మాట. ఇక్కడ జగన్ కి చాలా లాభంగా ఈ నిర్ణయం ఉంటుంది అంటున్నారు. ఉన్న వారిని కంటిన్యూ చేసుకుంటూ పోయినా మరో పాతిక మంది ఎంపీలకు టికెట్లు ఇచ్చి గెలిపించుకోవడం ద్వారా జగన్ రాజకీయంగా భారీ లాభాన్నే పొందుతారు అంటున్నారు. ఆలాగే జాతీయ రాజకీయాల్లో కూడా స్ట్రాంగ్ అవుతారు.ఇది ఎంపీల సీట్లు పెంచడంతోనే ఆగదని, విభజన చట్టం ప్రకారం ఏపీలో అసెంబ్లీ సీట్ల సంఖ్యను కూడా పెంచాలన్న తమ పెండింగ్ డిమాండ్ ని అటు కేసీయార్, ఇటు జగన్ కేంద్రం వద్ద పెడతారు అంటున్నారు. ఇంత పెద్ద కసరత్తు చేస్తున్న బీజేపీ తెలుగు రాష్ట్రాల విషయంలో కూడా ఉదారంగా ఉంటుంది అంటున్నారు. అంటే అసెంబ్లీ సీట్లను కూడా పెంచుతారు అన్న శుభవార్తను మోడీ వినిపిస్తారుట. అదే జరిగితే అటు కేసీయార్ కి ఎదురుండదు, అక్కడ 150 దాకా సీట్లు వస్తాయి. ఇక్కడ ఏపీలో జగన్ కి 225 సీట్లు వస్తాయి. దాంతో ఏపీలో జగన్ సులువుగా రెండవసారి అధికారంలోకి రావడానికి మార్గం సుగమం అవుతుంది అంటున్నారు. తాను అనుకున్న విధంగా అసెంబ్లీ సీట్లను విభజించుకుని మరీ జగన్ 2024 ఎన్నికల్లో మళ్ళీ సీఎం కావడం ఖాయమే అంటున్నారు. అలా మోడీ ప్లాన్ బాబుకు గట్టి షాక్ ఇస్తుందనే చెబుతున్నారు.

# సచివాలయాలకు భవనాలు కొరత

నెల్లూరు, జూలై 28, (న్యూస్ పల్స్)రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా గ్రామ/వార్డు సచివాలయాల వ్యవస్థ ఏర్పాటు చేసి రెండేళ్లవుతున్నా... నేటికీ ఆయా సచివాలయాలకు శాశ్వత భవనాల్లేవు. సంక్షేమ పథకాలతోపాటు అభివృద్ధిలో కీలకంగా వ్యవహరిస్తున్న గ్రామ/వార్డు సచివాలయాల్లో అత్యధిక శాతం ఇతర శాఖలకు చెందిన ప్రభుత్వ భవనాల్లో సర్దుబాటు చేసుకుంటూ పాలన సాగిస్తున్న పరిస్థితి రాష్ట్రంలో నెలకొంది. గ్రామీణ ప్రాంతాల్లో సచివాలయాల నిర్మాణాలకు ఉపాధి హామీ నిధులు ఉపయోగిస్తుండటంతో కొంతమేరకు భవన నిర్మాణాలు జరిగాయి. అయితే పట్టణ, నగర ప్రాంతాల్లో ఉపాధి హామీ నిధులు వాడుకునే సౌలభ్యం ఉండకపోవడం, స్థలాల సమస్య గ్రామ, వార్డు సచివాలయాల శాఖను వేధిస్తోంది. దీంతో పట్టణాల్లో నిర్మాణాల కంటే సర్దుబాటుకే ప్రభుత్వం ప్రాధాన్యత ఇచ్చింది. ఇప్పటి వరకూ 10,929 వార్డు సచివాలయ భవన నిర్మాణాలకు ప్రభుత్వం అనుమతులు ఇచ్చింది. ఇందుకు రూ.4,180 కోట్లు ఖర్చవుతుందని ప్రభుత్వం అంచనా వేసింది. ఇందులో 5,137 భవనాల్లో మాత్రమే పనులు పూర్తికాగా, స్లాబు దశలో 3,628, బేస్‌మెంటు లెవెల్‌లో 456 భవన నిర్మాణాలు ఉన్నాయి. వీటితోపాటు మరో 1,708 భవనాలు పునాది దశకు కూడా చేరుకోలేదు. అలాగే 13 జిల్లాల్లోని నగరాల్లో 3,800 వార్డు సచివాలయాలకు భవనాలు నిర్మించాల్సి ఉండగా, ఇప్పటి వరకు కేవలం 800 కంటే తక్కువ నిర్మించినట్లు అధికార వర్గాల నుంచి తెలిసింది. పట్టణాల్లో శాశ్వత భవనాల నిర్మాణానికి స్థల సమస్య ప్రధానం కాగా, ఆయా భవన నిర్మాణాలకు మున్సిపల్ కార్పొరేషన్లలో నిధుల లభ్యత తక్కువ కావడం కారణంగా పలువురు పేర్కొంటున్నారు. గ్రామ సచివాలయ భవన నిర్మాణాలతోపాటు కార్యాలయంలో సిబ్బందికి అవసరమైన కంపూటర్లు, ఫర్నీచర్, మౌలిక వసతుల కల్పనకు సుమారు రూ.35 లక్షల నుంచి రూ.40 లక్షల వరకు ఖర్చవుతుందని ప్రభుత్వం అంచనా వేసింది. ఇతర శాఖల భవనాల్లో ప్రారంభించిన పలు సచివాలయాలు గత మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు పనులు చేసేందుకు ఆటంకం కలిగినట్లు పలువురు ఉద్యోగులు పేర్కొంటున్నారు. సచివాలయ ఉద్యోగులకు ఆగస్టులో ప్రొబేషనరీ పీరియడ్ డిక్లేర్ చేయనున్న తరుణంలోనైనా గ్రామ/వార్డు సచివాలయాలకు శాశ్వత భవనాలు నిర్మించాలని పలువురు విజ్ఞప్తి చేస్తున్నారు.

# మొగలి రేకుల సీరియల్ లా... రఘురామ ఎపిసోడ్

ఏలూరు, జూలై 28, (న్యూస్ పల్స్)లుగు రాష్ట్రాల్లో ప్రస్తుతం అత్యంత వినోదభరిత కార్యక్రమం ఏమిటి అని ఎవరిని అడిగినా రఘురామకృష్ణంరాజు సీరియల్ ఎపిసోడ్స్ చెబుతారు. కరోనా లో జగన్ సర్కార్ పై అలుపెరగకుండా విమర్శలు, ఆరోపణలు ఎక్కుపెడుతూ అందరిని నవ్విస్తూ, వైసీపీ ని ఏడిపిస్తూ వస్తున్నారు నర్సాపురం ఎంపి. ఆయనపై చర్యలు తీసుకోకుండా వినోదం లో పాలుపంచుకుంటూ పార్లమెంట్ స్పీకర్ పరోక్షంగా వైసిపిని ఇబ్బంది పెడుతున్నారు. రఘురామకృష్ణంరాజు ను సిఐడి అరెస్ట్ చేయడం, కోర్టు మీడియా ముందుకు వెళ్లోద్దని ఆదేశించినా కొంతకాలం లేఖలతో టిడిపి మీడియా కు పతాక శీర్షికలుగా మారుతూ వచ్చారు. తాజాగా ఆయనకు బెయిల్ నిబంధనల్లో వచ్చిన సడలింపులతో తిరిగి బుల్లి తెర పైనా సోషల్ మీడియా లో యధావిధిగా హల్చల్ సాగిస్తున్నారు.పాడిందే పాటరా అన్న చందంగా నిత్యం జగన్ సర్కార్ పై ప్రతిపక్షాలకు మించి స్వపక్ష ఎంపి చదువుతున్న అష్టోత్తర నామావళి కూడా ప్రజలకు బోర్ కొట్టించింది. ఈ మధ్య ఆయన రేటింగ్ కూడా దారుణంగా పడిపోయిందని మీడియా వర్గాల గణాంకాలే వెల్లడిస్తున్నాయి. రఘురామ కృష్ణ రాజు ఆరోపణలు, విమర్శల్లో పస లేకపోవడంతో బాటు రొటీన్ గా మారిన శైలి కూడా జనాలను ముఖ్యంగా టిడిపి అభిమానులను సైతం ఆకట్టుకోలేకపోతుంది. చంద్రబాబు, లోకేష్ తో రఘురామ కృష్ణ రాజు బంధం సిఐడి బయటకు చాటింగ్ రూపంలో చేసిన లీక్ వ్యవహారంతో ప్రస్తుతం ఆయన్ను టిడిపి నేతగానే జనం చూడ్డం మొదలు పెట్టేశారు. దాంతో రఘురామకృష్ణంరాజు మరింతగా రెచ్చిపోవడం కనిపిస్తుంది.రఘురామ కృష్ణ రాజు ఎపిసోడ్స్ ఇప్పటివరకు ఉండొచ్చనే చర్చ రాజకీయ వర్గాల్లో జోరుగానే సాగుతుంది. ఇది ఇప్పట్లో ఫినిష్ అయ్యే వ్యవహారం కాదని వచ్చే ఎన్నికల వరకు కొనసాగుతుందని పలువురు భావిస్తున్నారు. స్పీకర్ ఆయనపై అనర్హత వేటు వేసే అంశం అనుమానమేనని అలాగే వైసీపీ ఆయన్ను ఈ పార్లమెంట్ సెషన్ వరకు చూసి బహిష్కరించ వచ్చని తెలుస్తుంది. మరోపక్క ప్రస్తుతం జగన్ బెయిల్ రద్దు కోసం రఘురామకృష్ణంరాజు వేయికళ్లతో ఎదురుచూస్తున్నారు. అది ఏదో ఒక కారణంతో కోర్ట్ లో జరుగుతున్న కేసు వాయిదాలు పడుతూ ఉండటంతో ఇరుపక్షాల కు ప్రస్తుతం అయితే కంటిమీద కునుకు లేదు. ఈ నేపథ్యంలో రఘురామ కృష్ణ రాజు సీరియల్స్ మొగలి రేకుల సీరియల్ కు మించే నడుస్తుంది ఎవరు చూసినా చూడకపోయినా అన్నది తెలుగు రాష్ట్రాల్లో ఉన్నవారికి క్లారిటీ వచ్చేసింది.

# ఆటోను ఢీకొట్టిన లారీ ముగ్గురు మృతి

అమరావతి జూలై 28 పశ్చిమ గోదావరి జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ప్రయాణికులతో వెళ్తున్న ఆటోను లారీ ఢీకొట్టింది. ఈ దుర్ఘటనలో ముగ్గురు అక్కడికక్కడే మృత్యువాతపడ్డారు. ఈ ఘటన నల్లజర్ల మండలం పుల్లలపాడులో బుధవారం మధ్యాహ్నం చోటు చేసుకుంది. నల్లజర్ల నుంచి భీమడోలు మండలం పోలసానపల్లికి ఆటో వెళ్తున్న సమయంలో పుల్లలపాడువద్ద లారీ ఢీకొట్టింది. ఆటోలో ప్రయాణిస్తున్న ముగ్గురు మృతి చెందగా.. మరో నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. వెంటనే క్షతగాత్రులను ఆసుప్రతికి తరలించారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని.. ఘటన జరిగిన తీరును పరిశీలించారు. ప్రమాదంపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఘటనకు సంబంధించి పూర్తి వివరాలు తెలియాల్సి ఉన్నది.

# నాటుసారా బట్టీలు ధ్వంసం

మద్దికెర మద్దికేర మండల పరిధిలో సమీప ప్రాంతంలో నాటు సారా బట్టీలను ధ్వంసం చేసినట్లు మద్దికేర ఎస్.ఐ మమత తెలియజేశారు.మంగళవారం రోజున నాటు సారా బట్టీలు గల స్థావరాలపై తన సిబ్బంది తోటి దాడులను నిర్వహించినట్లు ఎస్.ఐ మమత తెలియజేశారు.ఈ సందర్భంగాఆమె మాట్లాడుతూ తమకు అందిన సమాచారం మేరకు నాటుసారా స్థావరాలపై పోలీస్ సిబ్బందితో దాడి చేసి సారా బట్టీలను ధ్వంసం చేసి 300 లీటర్ల ను,2 బాటిల్స్ ను ధ్వంసం చేసినట్లు ఆమె తెలియజేశారు. మండల పరిధిలో సారా బట్టీల నిర్వహించిన మరియు సారాను విక్రయించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఆమె హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో మద్దికేర పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# పిల్ల కాంగ్రెస్, పెద్ద కాంగ్రెస్ కలుస్తాయా...

విజయవాడ, జూలై 28, (న్యూస్ పల్స్)ఈ రోజు దేశ రాజకీయాలను ప్రభావితం చేస్తున్న వారిలో ప్రశాంత్ కిశోర్ ముందుంటారు అని చెప్పాలి. రాజకీయ వ్యూహకర్త స్థాయి నుంచి ఆయన రాజకీయ చాణక్యుడిగా ఎదిగారు. ఆయన దేశంలో చిందరవందరగా ఉన్న రాజకీయ పార్టీలను ఒక్కటిగా చేసే పనిలో బిజీగా ఉన్నారు. ఇక్కడ ప్రశాంత్ కిశోర్ అలియాస్ పీకేకు కలసివచ్చే అంశం ఏంటి అంటే ఆయన వ్యూహాలతో చాలా రాష్ట్రాలలో ముఖ్యామంత్రులుగా అయిన వారు ఉన్నారు. ఆ పరిచయాలు, మొహమాటాలు అన్నీ కూడా వాడేసుకుని మరీ బీజేపీ వ్యతిరేక కొత్త రాజకీయ వంటకాన్ని జాతీయ స్థాయిలో తయారు చేస్తున్నారు.దేశంలో కాంగ్రెస్ వైభవం బాగా వెలిగిపోతున్న వేళ రెండవమారు అధికారంలోకి వచ్చి కొద్ది నెలలు కూడా కాని వేళ జగన్ సోనియాగాంధీతో విభేదించి బయటకు వచ్చేశారు. ఈ రోజుకు పుష్కర కాలం అయింది ఈ బంధం తెగిపోయి. జగన్ కాంగ్రెస్ అన్న మాట కూడా అసలు ఎత్తడంలేదు. కానీ రాజకీయాలల్లో ఇలాంటివి అసలు కుదరవు. ఎవరితో ఎపుడు ఏ అవసరం పడుతుందో కూడా తెలియదు. జాతీయ రాజకీయాన మోడీ హవా ముగుస్తున్న వేళ దేశంలో వాతావరణం మారుతోంది. దానికి సూత్రధారిగా జగన్ మిత్రుడు ప్రశాంత్ కిశోర్ ఉన్నారు. దాంతో కాంగ్రెస్ తో తెగిన బంధాన్ని మళ్ళీ బిగించేందుకు ప్రశాంత్ కిశోర్ తయారుగా ఉన్నారని అంటున్నారు.ఏపీలో జగన్ మళ్లీ అధికారంలోకి వస్తారని బీజేపీ కాంగ్రెస్ రెండూ అంచనాలు వేస్తున్నాయి. మమతకు కూడా ఆ సంగతి తెలుసు. దాంతో అందరి చూపూ జగన్ మీదనే ఉంది. అయితే జగన్ ఇప్పటికిపుడు బీజేపీతో వైరం కోరి తెచ్చుకోలేరు. అలాగని తానుగా కాంగ్రెస్ తో చేతులు కలపరు. అందుకే ప్రశాంత్ కిశోర్ సంధాన కర్తగా ఉంటారని అంటున్నారు. జగన్ తో పాత వైరాలు మరచి స్వాగతించడానికి కాంగ్రెస్ సిద్ధంగా ఉందని అంటున్నారు. ఈ మేరకు చేయాల్సినవి అన్నీ ప్రశాంత్ కిశోర్ చేశారని కూడా చెబుతున్నారు. మరో వైపు చూస్తే జగన్ దీనికి ఓకే అనాలి. పీకే ఆ దిశగా జగన్ ని మార్చేందుకు గట్టిగానే ప్రయత్నాలు మొదలెట్టారట.జగన్ ఇపుడేమీ సౌండ్ చేయరు. ఆయన బీజేపీ తో కోరి శతృత్వం కూడా తెచ్చుకోరు.

ఆయన ఎన్నికలకు ఆరు నెలలు ముందు మాత్రమే తన రాజకీయ వ్యూహాన్ని అమలు చేస్తారు. కచ్చితంగా ఆయన నాటి రాజకీయం బట్టి ఏ వైపు అయినా మొగ్గు చూపుతారు అంటున్నారు. ప్రశాంత్ కిశోర్ వంటి మిత్రుడు జాతీయ రాజకీయ చక్రాన్ని పట్టడమే జగన్ కి వరంగా మారుతోంది అంటున్నారు. అలా కనుక చూస్తే జగన్ కి ఇపుడు ఆప్షన్లు కూడా పెరిగాయి అంటున్నారు. ఒకనాడు చంద్రబాబుకు ఉన్న అవకాశాలు అన్నీ కూడా ఇపుడు జగన్ కి అలా కలిసివస్తున్నాయి. జగన్ మాత్రం 2023 చివరి దాకా తన జాతీయ రాజకీయ పంథాపైన కనీస సమాచారం కూడా ఇవ్వరు అంటున్నారు. అపుడే ఆయన పావులు కదుపుతారని అంటున్నారు. మొత్తానికి కాంగ్రెస్ తో జగన్ కలిస్తే మాత్రం అది జాతీయ రాజకీయాలలో పెద్ద సంచలనం. అంతే కాదు బీజేపీ హ్యాట్రిక్ ఆశల మీద కూడా పిడుగుపాటుగా మారుతుంది అంటున్నారు.

# గో వధ నిషేధ చట్టానికి వ్యతిరేకంగా మాట్లాడిన ఎమ్మెల్యేపై చర్యలు తీసుకోవాలని తహసీల్దార్ కు వినతిపత్రం అందజేత

కుక్కునూరు జూలై 28, (న్యూస్ పల్స్) మండలం బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు సోమూవీర్రాజు పిలుపు మేరకు గో వధ నిషేధచట్టానికి వ్యతిరేకంగా మాట్లాడిన గోవు భారతీయ జీవన విధానంలో అంతర్భాగమై మాతృదేవత అంతటి స్థానాన్ని పొంది గోమాతగా రూపుదిద్దుకున్నది. భారతీయ పరంపరలో భాగమైన గోమాతను కాపాడవలసిన బాధ్యత భారతీయులందరి మీద ఉన్నది. భారత రాజ్యాంగములో కూడా గోసంరక్షణ గురించి స్పష్టమైన చట్టాలు ఉన్నాయి. గో సంరక్షణ కేవలం ధార్మిక భావనతో మాత్రమే కాక మానవ మనుగడకు మూలాధారమైన వ్యవసాయ నిర్వహణలో, గో ఆధారిత సేద్యం, శాస్త్రీయంగా ఉపయుక్తంగా యున్నది. ఆంధ్రప్రదేశ్ లో వై.ఎస్.జగన్మోహన్ రెడ్డి అధికారంలోకి వచ్చిన తరువాత, హిందువుల మనో భావాలు దెబ్బతినే రీతిగా ఇక్కడ పుణ్యక్షేత్రాలను నిర్లక్ష్యం చేస్తూ, గో సంరక్షణను అపహాస్యం చేస్తూ, హిందువుల మనోభావాలను కించపరిచిన విషయం తెలిసిందే. కర్నూలు జిల్లా ఎమ్మిగనూరు అసెంబ్లీ పరిధిలో బక్రీదు పండుగ సందర్భముగా అక్రమంగా గోమాతలను కభేశాలకు తరలిస్తున్న సమయంలో, స్థానిక కార్యకర్తలు అడ్డుకొని తగుచర్యలు తీసుకోవాలని పోలీస్ శాఖ వారిని అభ్యర్ధించడం జరిగింది. పోలీస్ శాఖ నుండి ఎటువంటి స్పందన లేదు. ఆ సందర్భముగా స్థానిక ముస్లిం ముష్కరులు అక్కడికి వచ్చి పోలీస్ వారి సమక్షములోనే కార్యకర్తలను తీవ్రముగా కొట్టడం, వారి పరిస్థితి ప్రమాదకరంగా ఉండడముచే స్థానిక ఆసుపత్రికి తరలించడం. జరిగింది. ఈ సంఘటనలో పోలీసులు ప్రేక్షక పాత్ర వహించడాన్ని బిజెపి ఖండిస్తున్నది. బాధిత కార్యకర్తలలో దళిత సోదరుడు ఉన్నపటికి కూడా, వారి రక్షణార్ధము ఉన్నటువంటి ఎస్సి,ఎస్టీ చట్టాలను కూడా పరిగణలోనికి తీసుకోక వారికి న్యాయం చేకూర్చలేదు. సంఘటన జరిగి వారంరోజులు గడుస్తున్నా ఇప్పటి వరకు పోలీస్ వారు దాడి చేసిన దుండగులపై ఎటువంటి చర్యలు చేపట్టక పోవడం అనేక అనుమానాలకు తావిస్తున్నది. ఈ రాష్ట్రంలో ప్రభుత్వం పనిచేస్తున్నదా అని సందేహం కలుగుతున్నది. ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి ఒక స్పష్టమైన హిందూ వ్యతిరేక ఆజెండాతో పాలన సాగిస్తున్నట్లు స్పష్టమౌతోంది. అధికార పార్టీ ఎమ్మిగనూరు ఎమ్మెల్యే చెన్నకేశవ రెడ్డి ఒక అడుగు ముందుకు వేసి, ముస్లిం సంతుష్టికరణ విధానాన్ని ప్రోత్సహిస్తూ వారి సమక్షంలో కొన్ని వివాదాస్పద వ్యాఖ్యలు చేయడంతో ఈ దేశంలోని కోట్లాది మంది హిందువుల మనోభావాలు గాయపడ్డాయి. గోసంరక్షణ చట్టాలు ఇప్పుడు అవసరంలేదని,

వెంటనే ఎత్తివేయాలని ఎమ్మెల్యే డిమాండ్ చేయడం తోపాటుగా సెక్యులరిజం ముసుగులో గోసంరక్షణ చట్టాలను అవహేళన చేస్తూ ముస్లిం విధానాన్ని ప్రోత్సహిస్తూ మెజారిటీ ప్రజల మనోభావాలను దెబ్బతీసే విధంగా మాట్లాడిన ఎమ్మెల్యే చెన్నకేశవ రెడ్డిని తక్షణమే బర్తరఫ్ చేయవలసినదిగా బిజెపి తరుపున డిమాండ్ చేస్తున్నామని, కార్యకర్తలపై హత్య ప్రయత్నం చేసిన ముస్లిం గుండాలను వెంటనే అరెస్ట్ చేసి రిమాండ్ కు పంపాలని దళిత కార్యకర్తలకు ఎస్సి అట్రాసిటీ చట్టాల కింద తగిన న్యాయం చేయాలని, అనుచిత వ్యాఖ్యలు చేసి, రాజ్యాంగాన్ని అపహాస్యం చేసిన చేయడంతో తోపాటుగాగో వధ నిషేధ చట్టానికి వ్యతిరేకంగా మాట్లాడిన అధికార పార్టీ ఎమ్మిగనూరు ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, కుక్కునూరు మండల తహసిల్దార్ కు వినతిపత్రం ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో మండలమహిళామోర్చాఅధ్యక్షురాలు రాచమడుగు వరలక్ష్మీ, నిరంజన్, గిరిజన మోర్చా జిల్లా అధ్యక్షులు కుంజా వెంకటనర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

# ఏడు దేశాల్లో నో కరోనా రూల్స్

న్యూఢిల్లీ, జూలై 28, (న్యూస్ పల్స్) ప్రపంచానికి మహమ్మారిలా తయారైన కరోనా మొదలై ఇప్పటికే ఏడాదిన్నర దాటిపోయింది. ఎన్నో దేశాలు వైరస్ ధాటికి అల్లాడిపోయాయి. చాలా దేశాలు ఇప్పుడిప్పుడే తేరుకుంటున్నాయి. ఫాస్ట్ గా టీకాలు వేసిన కొన్ని దేశాలు ఇప్పటికే కరోనా రూల్స్ ను ఎత్తేశాయి. మాస్కులు పెట్టుకోనవసరం లేదని ప్రకటించాయి. కొన్ని దేశాల్లో మాత్రం పరిస్థితి మెరుగైనట్లే కన్పించి.. మళ్లీ డెల్టా వేరియంట్ కారణంగా రిస్క్ పెరిగింది. దీంతో ఇజ్రాయెల్, ఆస్ట్రేలియా వంటి దేశాలు మళ్లీ ఆంక్షలు, లాక్ డౌన్?ల దిశగా అడుగులు వేస్తున్నాయి.బ్రిటన్?లోని ఇంగ్లాండ్ లో ఇప్పుడు ఫేస్ మాస్కులు పెట్టుకోవాల్సిన అవసరంలేదు. ఇతర కరోనా రూల్స్ అన్నీ ఎత్తేశారు. కరోనా నుంచి ఫ్రీడమ్ వచ్చేసిందని ప్రభుత్వం ప్రకటించింది. కానీ జనం రద్దీగా ఉండేచోట్ల మాత్రం మాస్కులు పెట్టుకోవాలంది. స్కాట్లాండ్?లో షాపులకు వెళ్లినప్పుడు, బస్సుల్లో ప్రయాణిస్తున్నప్పుడు, రెస్టారెంట్లు, పబ్ లలో తినేందుకు కూర్చున్న టైంలో తప్ప నిలబడినప్పుడు మాస్కులు పెట్టుకోవాలని ప్రభుత్వం ఆదేశించింది. వేల్స్?లో పబ్లిక్ ఇండోర్ ఏరియాల్లో మాస్కులు పెట్టుకోవాలని అక్కడి సర్కార్ చెప్తోంది. ఇక నార్తర్న్ ఐల్యాండ్?లో ప్రార్థనా మందిరాల్లో, క్లాస్ రూంలలో సోమవారం నుంచి మాస్కులు తప్పనిసరికాదు.

ఇజ్రాయెల్, ఆస్ట్రేలియా యూటర్న్

మాస్క్ అవసరంలేదని ప్రకటించిన కొన్ని వారాలకే మళ్లీ కేసులు పెరగడంతో ఇజ్రాయెల్ యూటర్న్ తీసుకుంది. పోయిన నెలలోనే మాస్కులను తప్పనిసరి చేసింది. ఇజ్రాయెల్ కరోనాను బాగా కట్టడి చేయడంతో పాటు ఫాస్ట్?గా దేశంలోని పెద్దవాళ్లందరికీ వ్యాక్సిన్లు వేసింది. అయితే డెల్టా వేరియంట్ కారణంగా దేశంలో మళ్లీ కేసులు పెరుగుతున్నాయి. దీంతో గురువారం నుంచి మళ్లీ ఆంక్షలను విధించారు. అలాగే ఆస్ట్రేలియాలోనూ కేసులు పెరుగుతుండటంతో మళ్లీ లాక్?డౌన్?లు పెట్టారు. మాస్క్, ఇతర రూల్స్?ను స్ట్రిక్ట్ చేశారు. స్వీడన్: కరోనా మొదలైనప్పటి నుంచీ స్వీడన్ ఫుల్ లాక్ డౌన్ పెట్టలేదు. బస్సుల్లో జనం రద్దీగా ఉంటేనే మాస్కులు పెట్టుకోవాలంది. ప్రజలు తమంతట తామే రూల్స్ పాటించాలని సూచించింది. రెస్టారెంట్లు, ఇతర ప్రాంతాల్లో రద్దీని తగ్గించేందు కు మాత్రం చర్యలు చేపట్టింది. దేశానికి వస్తున్న వాళ్లకు కరోనా టెస్ట్? తప్పనిసరి చేశారు.అమెరికా : చాలా రాష్ట్రాల్లో మాస్క్ కంప ల్సరీ కాదు. 2 డోసుల టీకా తీసుకున్నోళ్లకు మాస్క్ అక్కర్లేదని రాష్ట్రాలు ప్రకటించాయి. పబ్లిక్ ప్లేస్?లలో మాస్కులు పెట్టుకోవాల్సిన అవసరంలేదని 31 రాష్ట్రాలు ప్రకటించాయి.


చైనా: కరోనా పుట్టిన చైనా ఇప్పుడు మాస్క్ ఫ్రీ దేశం. ఇక్కడ కూడా మాస్కులు కంపల్సరీ కాదు. మొదట్లో కరోనా ఎఫెక్ట్ ఎక్కువగా పడినా, స్ట్రిక్ట్ లాక్ డౌన్?లతో వైరస్?ను కమ్యూనిస్ట్ సర్కార్ కట్టడి చేసింది. ఇప్పటికే దేశంలో 152 కోట్ల డోసుల టీకాలు వేశారు.

న్యూజిలాండ్: కరోనాను అన్ని దేశాల కంటే స్పీడ్ గా, బాగా కట్టడి చేసిన న్యూజిలాండ్ ప్రధాని జెసిండ్రా ఆర్డర్న్ కు ప్రశంసలు వెల్లువెత్తాయి. ఇక్కడ మాస్క్, ఇతర రూల్స్ ను కూడా త్వరగానే ఎత్తేశారు.

హంగరీ: హాస్పిటల్స్?లో తప్ప మిగతా ప్రాంతాల్లో ఫేస్ మాస్కులు అక్కర్లేదని ప్రభుత్వం ప్రకటించింది. మే నెలలో దేశంలో 50 లక్షల మందికి టీకాలను పూర్తి చేయడంతో మాస్క్, ఇతర రూల్స్ ను ఎత్తేశారు.

ఇటలీ: కిందటేడాది ఫిబ్రవరిలో తొలి కేసు గుర్తించిన నాటి నుంచి ఇటలీ ప్రభుత్వం కరోనా కట్టడి చర్యలు చేపట్టింది. జూన్?లో వైరస్? కేసులు కంట్రోల్?లోకి రావడంతో ప్రభుత్వం మాస్క్ రూల్?ను ఎత్తేసింది

# ఆన్ లైన్ క్లాసులపై చర్చోప చర్చలు



హైద్రాబాద్, జూలై 28, (న్యూస్ పల్స్)హైద్రాబాద్ నగరంలోని అనేక ప్రాంతాల్లో ప్రైవేట్ స్కూళ్లు ప్రస్తుతం ఆన్‌లైన్ క్లాస్‌లను నిర్వహిస్తున్నాయి. కొన్ని స్కూళ్లలో ఒకటో తరగతి నుంచే ఈ బోధన కొనసాగుతుండగా మరికొన్ని స్కూళ్లు 6వ తరగతి నుంచి 10వ తరగతి వరకు ఆన్‌లైన్ తరగతులను నిర్వహిస్తున్నాయి. కరోనా మహమ్మారి కారణంగా నెలకొన్న పరిస్థితులతో పిల్లల చదువులే కాకుండా విద్యాసంస్థల మనుగడ కూడా ఇప్పుడు ఆన్‌లైన్‌పై ఆధారపడి ఉండడం గమనార్హం. ఈ నేపథ్యంలో నిర్వహిస్తున్న కంప్యూటర్ పాఠాలు పిల్లలపై ఒత్తిడిని తీవ్రతరం చేస్తున్నాయని నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. బోధనా పద్ధతిలో మార్పు అవసరమని సూచిస్తున్నారు. క్లాస్ రూమ్ తరహాకు భిన్నంగా ఇష్టాగోష్ఠి పద్ధతిలో ఆన్‌లైన్ విద్యాబోధన ఉండాలని అభిప్రాయడుతున్నారు. ఆన్‌లైన్ క్లాసులతో పిల్లలు ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు కంప్యూటర్‌కు అతుక్కుపోతున్నారు. కొంతమంది మొబైల్ ఫోన్‌లలో క్లాసులకు హాజరవుతు న్నారు. దీంతో కేవలం ఒక డివైజ్‌పై దృష్టి సారించి గంటల తరబడి కూర్చోవడం వల్ల పిల్లల సృజనాత్మకత దెబ్బతింటుంది. చాలా మంది పిల్లలు కళ్లు పొడిబారడం, తలనొప్పి, వెన్నెముక నొప్పి వంటి శారీరక ఇబ్బందులకు గురవుతున్నట్లు డాక్టర్లు చెబుతున్నారు. మెదడు తీవ్రమైన ఒత్తిడికి గురవుతుంది. కొత్త విషయాలను నేర్చుకొనే సామర్థ్యం దెబ్బతింటుంది.

# కలెక్టర్ని కలిసిన డిసిఎంఎస్ చైర్మన్ వీరి చలపతి రావు

నెల్లూరు జూలై 28, (న్యూస్ పల్స్)నెల్లూరు జిల్లా కోపరేటివ్ మార్కెటింగ్ సొసైటీ-ఛైర్మన్ గా 2వసారి ప్రమాణస్వీకారం చేసిన వీరి చలపతిరావు కలెక్టర్ కె వి ఎన్ చక్రధర్ బాబుని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. డీసీఎంఎస్ అభివృద్ధికి తోడ్పాటు ఇవ్వాలని కలెక్టర్ను మీరు చలపతిరావు కోరారు.ఈ సందర్భంగా కలెక్టరు చక్రధర బాబు , వీరి చలపతిరావు ను 2వ సారి నియమితులైనందుకు హార్దిక శుభాకాంక్షలు తెలియజేశారు. డీసీఎంఎస్ అభివృద్ధికి ప్రభుత్వ సహకారం ఉంటుందన్నారు. రైతే రాజు దేశానికి వెన్నెముక అన్న చందంగా రైతులకు కావలసిన వివిధ విత్తనాలు, ఎరువులు సకాలంలో అందజేసేందుకు డీసీఎంఎస్ తన వంతు బాధ్యత నిర్వహించాల్సి ఉంటుంది అన్నారు. అనంతరం వారు డిస్ట్రిక్ట్ కోఆపరేటివ్ మార్కెటింగ్ సొసైటీ అభివృద్ధికి సంబంధించి సుదీర్ఘంగా చర్చించారు.

# జనసేన రాష్ట్ర కార్యక్రమాల నిర్వహణ కమిటీ కార్యదర్శిగా కొట్టే ఎంపిక

నెల్లూరు జూలై 28, (న్యూస్ పల్స్)నెల్లూరు జిల్లా జనసేన నాయకులు, చిరంజీవి యువత రాష్ట్ర నాయకులు కొట్టే వెంకటేశ్వర్లు జనసేన పార్టీ రాష్ట్ర కార్యక్రమాల నిర్వహణ విభాగం కార్యదర్శిగా ఎంపికయ్యారు. ఈ సందర్భంగా కొట్టే వెంకటేశ్వర్లు మాట్లాడుతూ జనసేన అధినేత పవకళ్యాన్ తన పై నమ్మకంతో అప్పగించిన ఈ బాధ్యతను పూర్తి స్థాయిలో నిర్వహిస్తూ, పార్టీ పటిష్టత, పార్టీ బలోపేతం కోసం తన వంతు కృషి చేస్తానని తెలియజేశారు. ఈ సందర్భంగా జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ కి ,పీఏసీ ఛైర్మెన్ నాదెండ్ల మనోహర్ , పార్టీ ప్రోగ్రాం కో ఆర్డినెటర్ కల్యాణం శివ శ్రీనివాస్(కేకే), జిల్లా అధ్యక్షులు చెన్నారెడ్డి మనుక్రాంత్ రెడ్డిగారితో పాటు, పార్టీ కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలియచేశారు.

# 32 వ డివిజన్ సచివాలయంలో ఆధార్ సెంటర్ ప్రారంభం

నెల్లూరు జూలై 28, (న్యూస్ పల్స్) నెల్లూరు గ్రామీణ నియోజకవర్గ పరిధిలోని కొత్త 32వ డివిజన్, శ్రీలంక కాలనీలోని సచివాలయంలో ఆధార్ సెంటర్ ను నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కార్యాలయం ఇంఛార్జ్ కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి బుధవారం ప్రారంభించారు . ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆధార్ నమోదు, ఆధార్ కార్డులో మార్పులు, చేర్పులు కోసం ఈ ఆధార్ సెంటరును ప్రారంభించడం జరిగిందన్నారు. ప్రతీ సంక్షేమ పథకానికి ఆధార్ ఎంతో అవసరం, అలాగే ప్రతీ మనిషి నిత్య అవసరంలా ఆధార్ మారిపోయింది, ఇలాంటి పరిస్థితుల్లో ఏర్పాటు చేసిన ఈ ఆధార్ సెంటరుని ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పై కార్యక్రమంలో డివిజన్ ఇంఛార్జ్ బత్తల కృష్ణ, కూకాటి హరి, రఘు, ఆదిరెడ్డి, నాయబ్ రసూల్, ఖాదర్ బాషా, విజయరామిరెడ్డి, అగ్రికల్చర్ మార్కెటింగ్ కమిటీ చైర్మన్ యేసు నాయుడు, వేదగిరి లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం ఛైర్మెన్ ఇందుపూరు శ్రీనివాసులు రెడ్డి, తురక సూరి, రాజా, రాజేష్, గౌస్ బాషా, రామకృష్ణ, కరిముల్లా, లక్ష్మణ్, పల్లాల శ్రీను వైసీపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# కృష్ణపట్నం పోర్ట్ భూముల కుంభకోణంలో అధికారుల సస్పెండ్

నెల్లూరు జూలై 28, (న్యూస్ పల్స్)నెల్లూరు జిల్లా, చిల్లకూరు మండలంలోని తమ్మినపట్నంలో రూ.50 కోట్ల కృష్ణపట్నం పోర్టు భూముల కుంభకోణం వెలుగులోకి వచ్చింది. తహసీల్దార్‌గా పనిచేసిన గీతావాణి, సీనియర్ అసిస్టెంట్ సిరాజ్, కంప్యూటర్ ఆపరేటర్ నవీన్ కుమార్‌లను సస్పెండ్ చేస్తూ జిల్లా కలెక్టర్ చక్రధర్ బాబు ఉత్తర్వులు జారీ చేసారు. చిల్లకూరు మండలం, తమ్మినపట్నం రెవెన్యూ పరిధిలో కృష్ణపట్నం పోర్టు కంపెనీ లిమిటెడ్‌కు 2009లో అప్పటి ప్రభుత్వం 352 ఎకరాల భూమిని అప్పగించిన విషయం తెలిసిందే. అందులో సర్వే నెంబర్ 94/3లో 271 ఎకరాల దేవుని మాన్యం భూములున్నాయి. రైతుల భూములన్నీ సేకరించి కేపీసీఎల్‌కు అప్పగించారు. అప్పటి నుంచి అవి ఖాళీగా ఉండడంతో అధికారపార్టీ పెద్దల కన్ను పడింది. పోర్టుకు చెందిన 209 ఎకరాల భూములకు సంబంధించి డైరెక్టర్ ఆఫ్ పోర్టుతో ఉన్న పేరును తొలగించారు. గ్రామంలో లేని, గుర్తు తెలియని 11 మంది పేర్లమీదకు మార్చారు. కొత్తగా సర్వే నెం. 327/382 హెచ్1 నుంచి 11 వరకు వెబ్ ల్యాండ్‌లో నకిలీ వ్యక్తుల పేర్లు సృష్టించారు. ఆ భూముల్లో కొన్నింటిని రిజిస్టర్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ చేయించారు. ఆడంగల్, పాస్ బుక్స్ కూడా సిద్ధం చేశారు.వెంకటాచలం మండలానికి చెందిన రవికుమార్ ప్రభుత్వ వైద్యాధికారి ఆయన కుటుంబసభ్యులకు చెందిన భూములు తమ్మినపట్నం ప్రాంతంలో ఉన్నాయి. బంధువులు, కుటుంబసభ్యులకు చెందిన భూములు తనవేనంటూ గతంలో ఆయన పరిహారం పొందారు. అసలు నిర్వాసితులు మాత్రం నష్టపోయారు. రవికుమార్ పేరుమీద రూ. 60 లక్షలు, అతని భార్య శ్రీసుధ పేరుపై రూ. 60 లక్షలు పరిహారం పొందడంపై అప్పట్లో తీవ్ర ఆరోపణలు వచ్చాయి. ప్రస్తుతం పోస్టల్ కారిడార్ కింద అధికారులు మళ్లీ భూ సేకరణ మొదలెట్టారు. అసలు నిర్వాసితులు న్యాయం కోసం తహసీల్దార్ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నారు. ఇదే సమయంలో ఈ భారీ భూ కుంభకోణం వెలుగులోకి వచ్చింది.

# ప్రాజెక్టులను పరిశీలించిన సీపీఐ బృందం

దేవరకొండ జూలై 28, (న్యూస్ పల్స్) దక్షిణ తెలంగాణలో నిధులు లేక నత్తనడకన సాగుతున్న ప్రాజెక్టుల పనులను సమీక్షిస్తున్నారు వామ పక్ష నేతల బృందం. సీనియర్ జర్నలిస్ట్, కె శ్రీనివాస్ రెడ్డి తో కలిసి నల్గొండ జిల్లా డిండి కి చేరుకున్న సిపిఐ నేతలు జిల్లాలోని పెండింగ్ ప్రాజెక్టులను పరిశీలిస్తున్నారు.నక్కల గండి,ఎస్ఎల్బిసి సొరంగ మార్గం పనుల జాప్యత పై ప్రాజెక్ట్ ఇంజినీర్ లతో చర్చిస్తున్నారు.అనంతరం నకిరేకల్ నియోజకవర్గంలోని బ్రాహ్మణ వెల్మెంల ఉదయ సముద్రం పనులను పరిశీలించనున్నారు.ముఖ్యమంత్రి కేసీఆర్ నల్గొండ జిల్లా పెండింగ్ ప్రాజెక్టులకు నిధులు ఇవ్వకుండా తాత్సారం చేస్తున్నారంటూ వస్తున్న ఆరోపణలపై నిపుణుల క్షేత్ర స్థాయి పరిశీలన ప్రాధాన్యత సంతరించుకుంది.

# అభివృద్ధి నిల్...దాడులు ఫుల్

**రాష్ట్రంలో క్షీణించిన శాంతి భద్రతలు**

**దేవినేని ఉమా దాడిని ఖండించిన తుగ్గలి మండల టిడిపి నాయకులు**

తుగ్గలి జూలై 28 ( విభారె) మాజీ మంత్రి దేవినేని ఉమా పై వైకాపా వర్గీయుల దాడి చేయడం చాలా ఘోరమని,ఈ దాడిని తీవ్రంగా ఖండిస్తున్నట్లు తుగ్గలి మండల తెలుగుదేశం పార్టీ మండల కన్వీనర్ తిరుపాల్ నాయుడు మరియు తుగ్గలి మండల తెలుగుదేశం పార్టీ ఉపాధ్యక్షులు రాంపురం వెంకట రాముడు చౌదరి తెలియజేశారు.ఈ సందర్భంగా వారు విలేకరులతో మాట్లాడుతూ కొండపల్లి రిజర్వ్ ఫారెస్ట్ నందు అక్రమ మైనింగ్ చేస్తున్నారని పరిశీలనకు వెళ్లిన మాజీ మంత్రి దేవినేని ఉమా వాహనం పై వైసిపి కార్యకర్తలు రాళ్ల దాడి చేసి విధ్వంసం సృష్టించడం చాలా దురదృష్టకరమని వారు తెలియజేశారు.రాష్ట్రంలో వైకాపా ప్రభుత్వం ఏర్పడినప్పటి నుండి అభివృద్ధి నిల్ దాడులు ఫుల్ గా కనిపిస్తున్నాయని వారు తెలియజేశారు.రాష్ట్ర వ్యాప్తంగా శాంతి భద్రతలు పూర్తిగా క్షీణించి,తెలుగుదేశం పార్టీ నాయకుల పై,కార్యకర్తల పై దాడులు మరియు హత్యలు పెరిగిపోతున్నాయని వారు తెలియజేశారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చ లేక రాష్ట్ర ప్రజలను అప్పుల ఊబిలోకి నెట్టివేస్తుందని వారు తెలియజేశారు. వైసిపి నాయకులు అభివృద్ధి మీద దృష్టి సాధించలేక టిడిపి నాయకుల పై దృష్టి సాధిస్తున్నారని వారు తెలియజేశారు.వైసీపీ ప్రభుత్వం పై ప్రజల్లో వ్యతిరేకత ప్రారంభమయిందని,వచ్చే ఎన్నికల్లో ప్రజలు తగిన గుణపాఠం నేర్పి,వచ్చే ఎన్నికలలో తెలుగుదేశం పార్టీకి పట్టం కడతారని వారు తెలియజేశారు.

# దేవినేని వ్యాఖ్యాలు గొడవకు కారణం

నందిగామజూలై 28 ( విభారె) మంగళవారం నాడు టిడిపి వైసిపి రెండు వర్గాల మధ్య గొడవ జరిగింది. గొడవకు కారణమైన రెండు వర్గాల పైన కేసు నమోదు చేశాం. ఈ కేసును పారదర్శకంగా దర్యాప్తు చేస్తున్నామని డీఎస్పీ బి శ్రీనివాసులు అన్నారు. పోలీసులు సకాలంలో స్పందించి గొడవను అడ్డుకోవడం జరిగింది. కొండపల్లి రిజర్వ్ ఫారెస్ట్ దేవినేని ఉమా చేరుకొని రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేశారని అయన అన్నారు. దేవినేని ఉమా వ్యాఖ్యలు గొడవకు కారణమయ్యాయి. పోలీస్ స్టేషన్ వద్ద కూర్చున్న దేవినేని ఉమా శాంతి భద్రతలకు విఘాతం కలిగించే ప్రయత్నం చేశారు. పోలీసులు ఎంత నచ్చచెప్పినా ఆయన వినిపించుకోలేదు. పోలీసుల పట్ల కనీస మర్యాద గా కూడా దేవినేని ఉమా వ్యవహరించలేదు. ఉమా తన అనుచరులను రెచ్చగొట్టి శాంతిభద్రతలకు గతం కలిగించే ప్రయత్నం చేశారు అందుకే కేసు నమోదు చేశాం. టిడిపి చెందిన 18 పై కేసు పెట్టడం జరిగింది. వైసిపి కి చెందిన ఆరుగురు పైన కూడా కేసు నమోదు చేశాం. ఈ కేసు ఇంకా దర్యాప్తులో ఉందని అయన తెలిపారు.

# మదనపల్లి లో తీవ్ర ఉద్రిక్తతకు దారితీసిన బీజేపీ ధర్నా

చిత్తూరు జూలై 28 ( విభారె) గో రక్షణ చట్టాన్ని ఉల్లంఘిస్తూ అనుచిత వ్యాఖ్యలు చేసిన వైసీపీ ఎమ్మెల్యేలపై సుమోటోగా పోలీసులు కేసు నమోదు చేసి అరెస్టు చేయాలని బిజెపి నాయకుల డిమాండ్ చేసారు. గో రక్షణ చట్టాన్ని ఉల్లంగిస్తూ వైసీపీ ఎమ్మెల్యేల చేత అనుచ్ఛిత వ్యాఖ్యలను ప్రేరేపిస్తున్న వైసీపీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా మదనపల్లి సబ్ కలెక్టర్ ఆఫీస్ లో ధర్నాకు దిగారు. కరోనా కష్టకాలంలో ఆర్థికంగా దివాలా తీసిన రాష్ట్ర ప్రభుత్వం ప్రజల దృష్టి మళ్లించడానికి ఇలాంటి అనుచిత వ్యాఖ్యల కు ప్రేరేపిస్తున్నారని ప్రభుత్వ పెద్దల పై ఆరోపణలు చేసారు. ఆంధ్రప్రదేశ్ లో అలజడి రేపడానికి ఉ ద్దేశపూర్వకంగా ఇలా చేస్తున్నారని బిజెపి రాష్ట్ర అధికార ప్రతినిధి భాను ప్రకాష్ రెడ్డి ఆరోపించారు. రాష్ట్రంలో ఎక్కడ లేనివిధంగా మదనపల్లిలో ఒక్క చోట మాత్రమే బిజెపి నాయకులను కార్యకర్తలనుఅరెస్టు చేయడాన్ని ఖండించారు. వీరిని సబ్ కలెక్టర్ కార్యాలయం నుండి మదనపల్లి వన్టౌన్ పోలీస్ స్టేషన్ కు తరలించారు. 1వ పట్టణ పోలీస్ స్టేషన్ ఆవరణంలో బిజెపి నాయకులు నిరసన, నేల పై బైఠాయించి అక్రమ అరెస్టులకు వ్యతిరేకంగా నినాదాలు చేసారు. .

# ఇది రాజారెడ్డి రాజ్యాంగం

**నారా లోకేష్**


ఏలూరు జూలై 28 ( విభారె) వైసీపీ అరాచకపాలన, మైనింగ్ మాఫియా, అవినీతి–అక్రమాలు, ఆగడాలకు అడుగడుగునా అడ్డుపడున్నారనే మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావుపై రాజారెడ్డి రాజ్యాంగం ప్రయోగించారని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ విమర్శించారు. . దేవినేనిపై దాడిచేసిన నిందితులను ఐపీసీ సెక్షన్ల కింద కేసులుపెట్టి, అరెస్ట్ చేయాల్సిన పోలీసులు... ఉల్టా ఆయనపైనే వైసీపీ సెక్షన్ల కింద కేసులుపెట్టి అరెస్ట్ చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నాను. బాధితుల్ని నిందితుల్ని చేసిన దుర్మార్గమైన పోలీసు వ్యవస్థ ఏపీలో వుండటం దురదృష్టకరం. ఒక మాజీ మంత్రినే చట్టవ్యతిరేకంగా ఇంతగా హింసిస్తుంటే..సామాన్యుల పరిస్థితి ఇంకెంత దయనీయంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. చట్టాన్ని చుట్టం చేసుకున్న పోలీసులూ! తాడేపల్లి కొంప కనుసైగలే చట్టంగా నిర్ణయాలు తీసుకున్న మీ బాస్ కి పట్టిన గతే...మీకూ తప్పదు.. కొద్దిగా టైము పడుతుందంతే. చట్టాన్ని మీరు చేతుల్లోకి తీసుకుని అన్యాయంగా వ్యవహరిస్తున్నా...న్యాయం ముందు దోషులుగా నిలబడక తప్పదని అయన అన్నారు.

# మీరు మీ ఆహారంలో ఎక్కువ ఉప్పును కలుపుతున్నారని కొన్ని హెచ్చరిక సంకేతాలు!



చాలా ఆహారాలలో ఉప్పు ఒక ముఖ్యమైన అంశం. కానీ మీరు మీ ఆహారంలో ఎక్కువ ఉప్పును చేర్చుకోవడం అలవాటు చేసుకుంటే, అది మీ మొత్తం ఆరోగ్యానికి హానికరం. కాబట్టి మన ఆహారంలో మనం కలిపే ఉ ప్పు మొత్తాన్ని చూడటం చాలా ముఖ్యం. ప్రారంభంలో ఆహారంలో కలిపిన ఉప్పు పరిమాణాన్ని తగ్గించడం వల్ల మీ వయస్సులో మీరు ఎదుర్కొంటున్న అనేక సమస్యలను నివారించవచ్చు. రక్తపోటు అనేది ఒక సాధారణ సమస్య, ముఖ్యంగా వృద్ధులకు. మీకు రక్తపోటు సమస్య ఉండకూడదని మీరు అనుకుంటే, మీరు మీ ఆహారంలో ఉప్పును మొదటి నుండి జాగ్రత్తగా చూసుకోవాలి. మీరు మీ ఆహారంలో ఎక్కువ ఉప్పు వేస్తే, అది కొన్ని లక్షణాలను చూపుతుంది. ఆ లక్షణాలతో మీరు మీ ఆహారంలో ఎక్కువ ఉ ప్పును చేర్చుకుంటున్నారో తెలుసుకోవచ్చు. అధ్యయనాల ప్రకారం, రోజుకు 6 గ్రాముల ఉప్పు తీసుకోవచ్చు. కానీ చాలా మంది రోజుకు 7.2 గ్రాముల ఉప్పును తీసుకుంటారు. మీరు ఎక్కువ ఉప్పు తీసుకుంటున్నారని సూచించే కొన్ని సంకేతాలు క్రింద విధంగా ఉన్నాయి. అధిక మూత్రవిసర్జన అధిక మూత్రవిసర్జన మీరు ఎంత తరచుగా మూత్ర విసర్జన చేస్తారు? అలా అయితే మీరు మీ ఆహారంలో ఎక్కువ ఉప్పును కలుపుతున్నారనడానికి ఇది ఒక సంకేతం. తరచుగా, మీరు అర్ధరాత్రి మేల్కొని మూత్ర విసర్జన చేయవచ్చు. అయితే, ఈ రకమైన మూత్రవిసర్జన మూత్రపిండాల సంక్రమణ మరియు టైప్ –2 డయాబెటిస్ వంటి అనేక ఆరోగ్య సమస్యలకు లక్షణం. కాబట్టి దీనికి ఖచ్చితమైన కారణాన్ని చూడండి. అయితే, మీరు మీ డైట్‌లో ఎక్కువ ఉప్పు కలిపినా, మీరు ఇంకా మూత్ర విసర్జన చేయవచ్చని మర్చిపోకండి. గర్భంలో కవలలు ఉన్నట్లు ముందస్తు సూచనలు ఉన్నాయి..అవి..గర్భంలో కవలలు ఉన్నట్లు ముందస్తు సూచనలు ఉన్నాయి..అవి.. నిరంతర దాహం నిరంతర దాహం ఒక వ్యక్తి తన ఆహారంలో ఎక్కువ ఉప్పు వేస్తే, అతనికి నిరంతర దాహం అనిపించవచ్చు. సోడియం అధికంగా ఉన్న ఆహారాన్ని తినేటప్పుడు, ఇది శరీర ద్రవ సమతుల్యతను దెబ్బతీస్తుంది మరియు దాహాన్ని కలిగిస్తుంది. దీన్ని పరిష్కరించడానికి ఏకైక మార్గం పుష్కలంగా నీరు త్రాగటం. వాతావరణ మార్పుల సమయంలో గజ్జి మరియు తామర నివారించడానికి కొన్ని చిట్కాలు ...!వాతావరణ మార్పుల సమయంలో గజ్జి మరియు తామర నివారించడానికి కొన్ని చిట్కాలు ...! వింత ప్రాంతాల్లో వాపు వింత ప్రాంతాల్లో వాపు అధికంగా ఉప్పు తీసుకోవడం వల్ల శరీరంలోని వివిధ భాగాలలో మంట వస్తుంది. మీ ముఖం ఉదయం వాపుగా కనబడటానికి ఇది కూడా ఒక కారణం కావచ్చు. కొన్నిసార్లు ఎక్కువ ఉ ప్పగా ఉండే ఆహారం తినడం వల్ల వేళ్లు, చీలమండల చుట్టూ వాపు వస్తుంది. శరీర కణజాలాలలో అధిక ద్రవం వల్ల ఈ రకమైన మంట వస్తుంది. దీన్ని ఎడెమా అని కూడా అంటారు. ఈ ఎడెమా సమస్య అధిక ఉప్పు తీసుకోవడం యొక్క ప్రధాన లక్షణంగా నమ్ముతారు. దీనికి ఒక సాధారణ పరిష్కారం ఆహారంలో ఉప్పును తగ్గించడం. మీకు ఎప్పుడూ జలుబు చేసినట్లు అనిపిస్తుందా? వాతావరణంలో మార్పుల వల్లే కాదు..ఈ ఆరోగ్య సమస్యల వల్ల కూడా కావచ్చుమీకు ఎప్పుడూ జలుబు చేసినట్లు అనిపిస్తుందా? వాతావరణంలో మార్పుల వల్లే కాదు..ఈ ఆరోగ్య సమస్యల వల్ల కూడా కావచ్చు మానసికంగా మనకు 'రన్ అవుట్ గ్యాస్' ఉన్నట్లు అనిపిస్తుంది మానసికంగా మనకు 'రన్ అవుట్ గ్యాస్' ఉన్నట్లు అనిపిస్తుంది మీరు తినే ప్రతిసారీ మీ ఆహారంలో ఎక్కువ ఉప్పు కలపాలని మీరు కనుగొన్నారా? మీరు ఆహారాన్ని చూసినప్పుడు విసుగు చెందుతున్నారా? అలా అయితే, మీ డైట్‌లో ఎక్కువ ఉప్పు కలిపే అలవాటు మీకు కారణం కావచ్చు. రుచి మొగ్గలు ఆ రుచికి అనుగుణంగా ఉంటాయి. ఫలితంగా, మీరు మీ ఆహారంలో ఎక్కువ ఉప్పును జోడించాల్సి ఉంటుంది. తరచుగా తేలికపాటి తలనొప్పి తరచుగా తేలికపాటి తలనొప్పి మీరు తరచుగా తేలికపాటి తలనొప్పిని ఎదుర్కొంటున్నారా? అలా అయితే, ఈ తలనొప్పి నిర్జలీకరణం ద్వారా ప్రేరేపించే అవకాశం ఉంది. ఎక్కువ ఉప్పు తినేటప్పుడు, డీహైడ్రేషన్ తరచుగా తేలికపాటి తలనొప్పికి కారణమవుతుంది. ఈ తలనొప్పిని ఎక్కువ నీరు త్రాగటం ద్వారా సరిదిద్దవచ్చు. ఉప్పగా ఉండే ఆహారాలకు ప్రవృత్తి ఉప్పగా ఉండే ఆహారాలకు ప్రవృత్తి మీరు మీ ఆహారంలో ఎక్కువ ఉప్పు కలిపినప్పుడు, మీ రుచి మొగ్గలు ఉప్పు రుచికి తగ్గట్టుగా మారుతాయి, ఇది మీరు ఉప్పగా ఉండే ఆహారాన్ని మళ్లీ మళ్లీ తినాలని కోరుకుంటుంది. అందుకే మీరు అకస్మాత్తుగా ఉప్పగా ఉన్న వేరుశెనగ, చిప్స్ మరియు ఇతర ఉప్పగా ఉండే ఆహారాన్ని తినాలని కోరుకుంటారు.

# కొత్త టెక్నీషియన్ తో మొదలైన పీకే 'ఏకే' మూవీ



పవన్ కళ్యాణ్ నటిస్తున్న రెండు సినిమాలు ప్రస్తుతం షూటింగ్ దశలో ఉన్నాయి. ఆ రెండు సినిమాలు కూడా ఈ ఏడాదిలోనే పూర్తి చేయాలనే ఉద్దేశ్యంతో పవన్ ఉన్నాడని వార్తలు వస్తున్నాయి. కరోనా వల్ల సెకండ్ వేవ్ కు కాస్త ముందే షూటింగ్ లకు పవన్ దూరం అయ్యాడు. ఈ నెల రెండవ వారంలో మళ్లీ షూటింగ్ కు జాయిన్ అవ్వాలని అనుకున్నాడు. అయితే దర్శకుడు సాగర్ చంద్ర మరియు సినిమాటోగ్రాఫర్ ప్రసాద్ మూరెళ్ల ల మధ్య చిన్న విభేదాలు ఉన్నాయని.. దాంతో ఆయన సినిమా నుండి తప్పుకున్నట్లుగా వార్తలు వచ్చాయి. ప్రసాద్ తప్పుకోవడంతో షూటింగ్ చివరి నిమిషంలో క్యాన్సిల్ అయ్యింది. షూటింగ్ ను ఎట్టకేలకు కొత్త సినిమాటోగ్రాఫర్ తో పునః ప్రారంభించేందుకు ఏర్పాట్లు జరిగాయి.నేటి నుండి పవన్ 'అయ్యప్పనుమ్ కోషియుమ్' రీమేక్ షూటింగ్ పునః ప్రారంభం అయ్యింది. రవి కే చంద్రన్ ఈ సినిమా కు కొత్త సినిమాటోగ్రాఫర్ గా వర్క్ చేస్తున్నాడు. పవన్ కళ్యాణ్ పై గతంలో తెరకెక్కించిన కొన్ని సన్నివేశాలను మళ్లీ తెరకెక్కించేందుకు సిద్దం అయ్యారు అంటూ వార్తలు వచ్చాయి. ఆ విషయం పై చిత్ర యూనిట్ సభ్యుల నుండి ఎలాంటి క్లారిటీ లేదు. కొత్త టెక్నీషియన్ రాకతో షూటింగ్ మొదట రెండు మూడు రోజులు స్లోగా సాగుతుందని అంటున్నారు. షూటింగ్ పునః ప్రారంభించినట్లుగా చిత్ర టీమ్ క్లారిటీ ఇచ్చింది. హైదరాబాద్ లో పవన్ తో పాటు కీలక నటీ నటులు ఈ షూటింగ్ లో పాల్గొంటున్నట్లుగా సమాచారం అందుతోంది.ఈసినిమా షూటింగ్ ను వచ్చే నెలలో ముగించే అవకాశాలు ఉన్నాయి. ఆ తర్వాత క్రిష్ దర్శకత్వంలో హరి హర వీరమల్లు సినిమా ను పవన్ మొదలు పెట్టబోతున్నాడు. ఈ రెండు సినిమాలు కూడా షూటింగ్ ను ఈ ఏడాదిలో ముగించాలని చాలా బలంగా పవన్ కోరుకుంటున్నాడు. కరోనా సెకండ్ వేవ్ వల్ల అయ్యప్పనుమ్ కోషియుమ్ ఆలస్యం అవుతుంది. లేదంటే ఇప్పటికే షూటింగ్ ముగిసేది అంటూ యూనిట్ సభ్యులు చెబుతున్నారు. సాగర్ చంద్ర దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమా కు రచయితగా త్రివిక్రమ్ వ్యవహరిస్తున్న కారణంగా అంచనాలు పీక్స్ లో ఉన్నాయి. అంచనాలకు తగ్గట్లుగా దర్శకుడు ఈ సినిమాను తెరకెక్కిస్తాడా చూడాలి. ఇక క్రిష్ సినిమాపై అంచనాలు ఏ రేంజ్ లో ఉన్నాయో తెల్సిందే.ఆ సినిమా చారిత్రాత్మక నేపథ్యం మూవీ అవ్వడంతో అంచనాలు భారీగా ఉ న్నాయి. పవన్ కళ్యాణ్ ఇప్పటి వరకు అలాంటి నేపథ్యంలో సినిమా లు చేయలేదు. కనుక పవన్ కు ఆ నేపథ్యం ఎలా ఉంటుందా అంటూ ఆసక్తిగా చూస్తున్నారు. ఇప్పటికే విడుదల అయిన ఫస్ట్ లుక్ కు మంచి రెస్పాన్స్ వచ్చింది. కనుక సినిమా కూడా తప్పకుండా పవన్ కెరీర్ లో టాప్ చిత్రంగా నిలుస్తుందనే నమ్మకంను యూనిట్ సభ్యులు వ్యక్తం చేస్తున్నారు. ఈ రెండు సినిమాలు మాత్రమే కాకుండా పవన్ వచ్చే ఏడాది మరో రెండు మూడు సినిమాలను కూడా చేయబోతున్నాడు. రాజకీయాలతో ఎంత బిజీగా ఉన్నా కూడా పవన్ మాత్రం వరుసగా సినిమాలను చేస్తూనే ఉంటాను అంటూ ఇటీవల ప్రకటించిన విషయం తెల్సిందే.





# నాని 'శ్యామ్ సింగ రాయ్' షూటింగ్ పూర్తి..!

నేచురల్ స్టార్ నాని హీరోగా దర్శకుడు రాహుల్ సాంకృత్యన్ తెరకెక్కిస్తున్న తాజా చిత్రం "శ్యామ్ సింగ రాయ్". కరోనా పరిస్థితుల అనంతరం ఇటీవలే షూటింగ్ తిరిగి ప్రారంభించిన మేకర్స్.. చిత్రీకరణ మొత్తం పూర్తి చేశారు. సినిమా షూటింగ్ పూర్తి చేసుకుని పోస్ట్ ప్రొడక్షన్ లోకి అడుగుపెడుతున్నట్లు చిత్ర బృందం అధికారికంగా ప్రకటించారు. కోవిడ్ –19 సెకండ్ వేవ్ ప్రభావం పడినా.. అకాల వర్షాలు భారీ గాలులు వచ్చి భారీ సెట్ ను దెబ్బతీసినా 'శ్యామ్ సింగ రాయ్' ను ఆపలేకపోయాయని పేర్కొన్నారు."శ్యామ్ సింగ రాయ్" చిత్రంలో సాయి పల్లవి – కృతి శెట్టి – మడోన్నా సెబాస్టియన్ హీరోయిన్లుగా నటిస్తున్నారు. ఇందులో నాని కొత్త మేకోవర్ లో కనిపిస్తున్నాడు. ఇప్పటికే విడుదలైన నాని – సాయి పల్లవి ఫస్ట్ లుక్స్ విశేషంగా ఆకట్టుకున్నాయి. తెలుగు ప్రేక్షకులకు సరికొత్త అనుభవాన్ని అందించేలా సరికొత్త స్టోరీతో దర్శకుడు ఈ చిత్రాన్ని ప్రతిష్టాత్మకంగా రూపొందిస్తున్నారు. కలకత్తా బ్యాక్ డ్రాప్ లో పీరియాడికల్ హై వోల్టేజ్ యాక్షన్ ఎంటర్టైనర్ గా దీన్ని తీర్చిదిద్దుతున్నారని తెలుస్తోంది.నిహారిక ఎంటర్టైన్మెంట్స్ బ్యానర్ పై ప్రొడక్షన్ నెం.1 గా 'శ్యామ్ సింగ రాయ్' సినిమా రూపొందుతోంది. బడ్జెట్ లో ఎక్కడా రాజీ పడకుండా గ్రాండ్ స్కేల్ లో నిర్మాత వెంకట్ బోయనపల్లి ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. షూటింగ్ కంప్లీట్ అయిన సందర్భంగా నిర్మాత చిత్ర బృందం మొత్తానికి కృతజ్ఞతలు తెలిపారు. 'శ్యామ్ సింగరాయ్' సినిమా రూపుదిద్దుకున్న తీరు పట్ల చాలా సంతోషంగా ఉంది. చాలా అడ్డంకులు ఎదురైనప్పటికీ.. మేము అంచనా అనుకున్న సమయానికి సినిమా షూటింగ్ పూర్తి చేయగలిగాం. దీనికి సహకరించిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు అని అన్నారు.'శ్యామ్ సింగ రాయ్' చిత్రంలోని ముఖ్యమైన భాగాన్ని కలకత్తా లో చిత్రీకరించారు. బెంగాల్ సంస్కృతిని ప్రతిబింబించే భారీ ఆలయ సెట్ లో కీలక సన్నివేశాలను షూట్ చేశారు. ఈ సినిమాతో సంబంధం ఉన్న ప్రతి ఒక్క నటీనటులు మరియు సాంకేతిక నిపుణులకు ఇది చాలా ప్రత్యేకమైన చిత్రమని మేకర్స్ చెబుతున్నారు. నాని కెరీర్లోనే భారీ బడ్జెట్ తో తెరకెక్కుతోన్న ఈ చిత్రానికి సత్యదేవ్ జంగా కథ అందించారు.మెలోడీ సాంగ్స్ స్పెషలిస్ట్ మిక్కీ జె.మేయర్ ఈ చిత్రానికి సంగీతం సమకూరుస్తున్నారు. సాను జాన్ వర్గేష్ సినిమాటోగ్రఫీ అందిస్తుండగా.. నవీన్ నూలి ఎడిటింగ్ బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. రవివర్మ యాక్షన్ కొరియోగ్రఫీ చేస్తున్నారు. అవినాష్ కొల్లా ప్రొడక్షన్ డిజైనర్ గా వర్క్ చేస్తున్నారు. 'శ్యామ్ సింగ రాయ్' చిత్రంలో జిషు సేన్ గుప్తా – రాహుల్ రవీంద్రన్ – మురళీ శర్మ – అభినవ్ గోమటం – లీలా శాంసన్ – మనీష్ వాద్వా – బారున్ చందా ఇతర కీలక పాత్రలు పోషిస్తున్నారు.



# విమానంలా గాల్లో తేలిన తెలుగమ్మాయ్

యోగాలో ప్రయోగాలతో సెలబ్రిటీలు ఆకట్టుకుంటున్నారు. యోగ విద్యలో ఇప్పుడు అడ్వాన్స్ డ్ క్రియేటివిటీ కనిపిస్తోంది. అనుష్క.. సమంత.. తమన్నా.. జాన్వీ.. మలైకా.. సంజన ఎవరికి వారు యోగాలో అనుభవజ్ఞులయ్యాక కొత్త అసనాలను క్రియేట్ చేస్తున్నారు. ఇప్పుడు అదే బాటలో తెలుగమ్మాయి అంజలి యోగాలో ప్రయోగాలతో ఆకర్షిస్తోంది.ఇన్ స్టాగ్రామ్ లో తన తాజా పోస్ట్ లతో అంజలి అందరికీ షాకిస్తోంది. తాజాగా తనదైన శైలిలో వైమానిక యోగా నైపుణ్యాన్ని ప్రదర్శించింది. ఇది చాలా క్లిష్టమైన యోగా.. కానీ చాలా సులువుగా చేసేస్తోంది. అలా ఊయల సాయంతో గాల్లో తేలిన అంజలి తలకిందులుగా వంగి కనిపిస్తోంది. "నేను వంగి ఉన్నాను.. కాబట్టి నేను తెగి కిందపడను" అని అంజలి ఈ స్నాప్ లకు శీర్షికను జోడించారు.కెరీర్ సంగతి చూస్తే.. ఇటీవల పవన్ కల్యాణ్ వకీల్ సాబ్ చిత్రంలో నలుగురిలో ఒక నటిగా కీలక పాత్రలో కనిపించింది. తదుపరి అంజలి అగ్ర నిర్మాతలతో ఓ రెండు తెలుగు చిత్రాల కోసం సంప్రదింపులు జరుపుతున్నారని తెలిసింది. మరోవైపు తమిళంలోనూ పలు చిత్రాల్లో నటిస్తున్నారు. ఇటీవల తన స్నేహితుడు జై నుంచి బ్రేకప్ అయ్యారని ప్రచారం సాగిన సంగతి తెలిసినదే.




EDITED, PRINTED,PUBLISHED AND OWNED BY AVULA VIJAYA BHASKARA REDDY PRINTED AT SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2,OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL- 518 001. ANDHRA PRADESH.
PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY,7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77190